తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

కరీంనగర్ - నిజామాబాద్

రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి

పెద్దపల్లి | జగిత్యాల

ఆదివారం

08 నవంబర్ 2026

పేజీలు : 8

Follow :



రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్ల గుర్తింపు ?

వాహనదారుల భద్రతకు ప్రత్యేక చర్యలు

మేడిపల్లి,నవంబర్ 7 (జనంసాక్షి):

జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలో గల జాతీయ రహదారి పైన రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఈరోజు కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కొమ్ము తిరుపతి, ఆర్అండ్బీ అధికారులు, మేడిపల్లి ఎస్ఐ ఎం. శ్రీధర్ రెడ్డి లు కలిసి మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించడం జరిగింది.ఈ సందర్భంగా ప్రమాదాలకు గల కారణాలను పరిశీలించి, భవిష్యత్తులో రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, రహదారి భద్రతా చర్యలు, అవసరమైన హెచ్చరిక బోర్డులు, ఇతర భద్రతా ఏర్పాట్ల గురించి ఆర్అండ్బీ అధికారులకు వివరించడం జరిగింది.గుర్తించిన బ్లాక్ స్పాట్ల వద్ద తగిన రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులు ఆర్అండ్బీ అధికారులను కోరారు. దీనికి స్పందించిన ఆర్అండ్బీ అధికారి వినీత్ గుర్తించిన బ్లాక్ స్పాట్లను నమోదు చేసుకుని, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల సీఐ తిరుపతి, మేడిపల్లి ఎస్ఐ శ్రీధర్ రెడ్డి, ఎస్బీ హెడ్ కానిస్టేబుల్ శంకర్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్



చిగురుమామిడి నవంబర్ 07 (జనంసాక్షి):

దీపావళి వెలుగులు ప్రతి ఇంటా ఆనందాన్ని,సంతోషాన్ని, సిరిసంపదలను నింపాలని రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగను రాష్ట్ర ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని మంత్రి కోరారు.దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు,సరికొత్త వెలుగులు నింపాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి సౌభాగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.పండుగ వేడుకలను ఆనందంగా జరుపుకుంటూనే పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకోవాలని, కాలుష్యాన్ని తగ్గించే విధంగా జాగ్రత్తలు పాటించాలని, చిన్నారులు బాణసంచా కాల్చే సమయంలో పెద్దలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు.







జిల్లా ప్రజలకు ప్రముఖుల దీపావళి శుభాకాంక్షలు

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 7 జనంసాక్షి:

దీపావళి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ పోతరాజు సాయి చైతన్య లు జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరి జీవితాల్లో కష్టాల కారుచీకట్లు తొలగిపోయి, చిరుదివ్వెల వెలుగుల వలే అనునిత్యం సుఖ సంతోషాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ ఎంతో ఉత్సాహంగా నిర్వహించుకునే దీపావళి పండుగను ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తూ, ఇంటిల్లిపాది ఆనందంగా జరుపుకోవాలని అభిలషించారు.

ఉత్సాహంగా.. వైభవంగా..

○ ఎన్టిపిసి 52వ ఆవిర్భావ దినోత్సవం..

○ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫైజ్ తయ్యబ్..

గోదావరిఖని, జనంసాక్షి :

ఎన్టిపిసి రామగుండం అండ్ తెలంగాణ స్టేషన్లో ఎన్టిపిసి 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని అత్యంత ఉత్సాహంగా, దేశభక్తి స్ఫూర్తితో జరుపుకున్నారు. పర్యావరణ సుస్థిరత, హరిత భవిష్యత్తు పట్ల ఎన్టిపిసి నిబద్ధతను ప్రతిబింబిస్తూ, పిటిఎస్ లోని మెయిన్ షాపింగ్ సెంటర్ నుండి సి-11 క్వార్టర్స్ వరకు ప్రభాత్ ఫేరీతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం సి-11 క్వార్టర్స్ గ్రౌండ్లో సామూహిక మొక్కల పెంపకం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈడీ (ఆర్ అండ్ టి) ఫైజ్ తయ్యబ్కు పరిపాలనా భవనంలో స్వాగతం పలకడంతో వేడుకలుప్రారంభమయ్యాయి. ఈ గర్వించదగిన సందర్భానికి గుర్తుగా ఎన్టిపిసి జెండా ఆవిష్కరణ, అనంతరం హెచ్ఓహెచ్ఆర్ స్వాగతోపన్యాసం, కేక్ కటింగ్, బెలూన్ల విడుదల వంటి కార్యక్రమాలు జరిగాయి. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో, న్యూఢిల్లీలోని కార్పొరేట్ సెంటర్ నుండి ఎన్టిపిసి లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ చేసిన ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు.



ఈ కార్యక్రమానికి రామగుండం, తెలంగాణలోని ఉద్యోగులు హాజరయ్యారు. ఈ వేడుకలు, సంస్థ నిరంతర శ్రేష్ఠతా ప్రస్థానం పట్ల మరియు దేశాభివృద్ధికి శక్తినివ్వాలనే దాని దార్శనికత పట్ల ఎన్టిపిసి ఉద్యోగుల సమిష్టి స్ఫూర్తిని, అంకితభావాన్ని, నిబద్ధతను ప్రతిబింబించాయి.

నూతన చైర్మన్ కు ఘన సన్మానం!



గన్నేరువరం, నవంబర్ 07 (జనంసాక్షి):

గన్నేరువరం మండలకేంద్రంలో శనివారం సందడిగా మారింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం అంతా పండుగ వాతావరణం నెలకొంది. కారణం..గన్నేరువరం, ఉమ్మడి బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ నూతన చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన మాతంగి శిరీష అనిల్ కి జరిగిన ఘన సన్మాన కార్యక్రమమే! విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించే మొదటి కార్యక్రమానికి హాజరైన శిరీష అనిల్... చిన్నారులతో కలిసి సరదాగా గడిపారు. అల్పాహారం వడ్డించి, విద్యార్థులతో మాట్లాడి అందరి మనసులు గెలుచుకున్నారు. అనంతరం జరిగిన సన్మాన కార్యక్రమంలో విద్యాధికారి కె. రామయ్య శాలువా కప్పి, ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి యువ నాయకత్వం రైతులకు, ప్రజలకు ఎంతో మేలు చేస్తుంది అని ఆయన అన్నారు.ఈ వేడుకకు గ్రామ సర్పంచ్ రంగనవేని లచ్చినర్సు, ఉప సర్పంచ్ రామంచ స్వామి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు సునీల్, కార్యదర్శి వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై సందడి చేశారు. చివరగా శిరీష అనిల్ మాట్లాడుతూ... నాపై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. రైతుల సంక్షేమం కోసం పని చేస్తా అని హామీ ఇచ్చారు. దాంతో సభలో చప్పట్లు మారుమోగాయి.



చిన్నచిన్న వీధుల్లో అంబులెన్స్ వెళ్లేలా రహదారులు

నగర మేయర్ మహంకాళి స్వామి

గోదావరిఖని, జనంసాక్షి ;

చిన్న చిన్న వీధులలో కూడా అత్యవసర పరిస్థితుల్లో కనీసం అంబులెన్స్ వెళ్లేలా రహదారుల నిర్మాణం చేపడుతున్నామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. డి ఎం ఎఫ్ టి నిధులు రూ 7.5 కోట్ల ప్యాకేజీ పనుల్లో భాగంగా రూ 15.00 లక్షల అంచనా వ్యయంతో 53 వ డివిజన్ ఎల్ ని నగర్ లోని ఒక వీధిలో సి సి రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ గట్ల రమేష్ తో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వెడల్పైన రహదారుల నిర్మాణానికి ప్రజలు సహకరించాలని కోరారు. నగరంలోని ప్రతి వీధి లోని చివరి ఇంటివరకు రోడ్డు , యు జి డి , మనీచి నీటి సరఫరా ,

వార్తా లోపలి పేజీలో

వెలమ కార్పొరేషన్ తొలి చైర్మన్కు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ శుభాకాంక్షలు

గోదావరిఖని, జనంసాక్షి:తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ తొలి చైర్మన్గా జూపూడి నర్సింగరావు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆయనను కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్లో శనివారం నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో జూపూడి నర్సింగరావు వెలమ కార్పొరేషన్ తొలి చైర్మన్గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. నూతన బాధ్యతలను స్వీకరించిన ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, నూతనంగా బాధ్యతలు చేపట్టిన జూపూడి నర్సింగరావు తన అనుభవం, అంకితభావంతో కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. వెలమ సామాజిక వర్గ ప్రజల సంక్షేమం, అభ్యున్నతి, విద్యా, ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కార్పొరేషన్ ద్వారా మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలని ఆకాంక్షించారు.వెలమ కార్పొరేషన్ తొలి చైర్మన్గా బాధ్యతలు చేపట్టిన జూపూడి నర్సింగరావు తన పదవీకాలంలో సామాజిక వర్గ అభ్యున్నతికి విశేషంగా కృషి చేయాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు.



ఏళ్ల తరబడి వేధిస్తున్న డ్రైనేజీ సమస్య

పరిష్కారానికి ఎమ్మెల్యేకు వినతి



సిరికొండ, నవంబర్ 7 జనం సాక్షి: సిరికొండ మండలం కుర్తుల్ పేట్ గ్రామంలో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతూ గ్రామ ఉప సర్పంచ్ గాండ్ల సతీశ్ ఎమ్మెల్యే భూపతి రెడ్డిని కోరారు. ఈ మేరకు శనివారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి గ్రామంలోని డ్రైనేజీ సమస్యను వివరించారు. సరైన మురుగునీటి కాలువలు లేకపోవడంతో గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎమ్మెల్యే భూపతి రెడ్డి సానుకూలంగా స్పందించి, గ్రామంలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు ఉప సర్పంచ్ గాండ్ల సతీశ్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు ఆర్థిక సాయం



ముస్తాబాద్ నవంబర్ 07 (జనం సాక్షి)ముస్తాబాద్ మండలం గూడూరు ప్రాథమిక పాఠశాల లో విద్యార్థులకు మెరుగైన డిజిటల్ విద్యాబోధన కు గాను గ్రామానికి చెందిన నాయిని నర్సింగరావు (అంజన్న)గారు వారి తల్లి వేంకటమ్మ గారి జ్ఞాపకార్ధం 50000 వేల రూపాయల విలువైన ప్రొజెక్టర్ ను ఇవ్వడం జరిగింది పాఠశాల లో ప్రారంభించిన సందర్భంగా వారిని సన్మానించి జ్ఞాపికను అందజేసి వారికి ధన్యవాదాలు తెలుపడం జరిగింది ఈ కార్యక్రమంలో . గ్రామ సర్పంచ్. చీటీ సునీత నర్సింగరావు ఉప సర్పంచ్. మండల విద్యాధికారి రవీందర్ , పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత, స్వప్న , వార్డు సభ్యులు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అల్లం బుజ్జమ్మ మృతదేహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



గోదావరిఖని, జనంసాక్షి :ప్రముఖ కవులు, రచయితలు, జర్నలిస్టులైన అల్లం రాజయ్య, అల్లం వీరయ్య, అల్లం నారాయ ణల తల్లి అల్లం బుజ్జమ్మ (95) వృద్ధాప్య ం, అనారోగ్య కారణాలతో మంథనిలో శుక్రవారం కన్నుమూశారు. ఆమె అంత్య క్రియలను శనివారం పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని స్వగ్రామం గాజులపల్లిలో నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ విషయం తెలుసుకున్న రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శనివారం గాజులపల్లికి చేరుకుని అల్లం బుజ్జమ్మ భౌతికకాయాన్ని సందర్శించారు. పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తెలంగాణ సమాజానికి కవులు, రచయితలు, జర్నలిస్టులుగా సేవలందిస్తున్న అల్లం రాజయ్య, అల్లం వీరయ్య, అల్లం నారాయణలకు జన్మనిచ్చిన మాతృమూర్తి అల్లం బుజ్జమ్మ మృతి కుటుంబానికి తీరని లోటని చందర్ పేర్కొన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

ముఖ్యమంత్రి పుట్టినరోజు సందర్భంగా తిరుమల కొండకు పాదయాత్ర



ముస్తాబాద్ నవంబర్ 07 (జనం సాక్షి)తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో ఉండాలని అలిపిరి నుండి తిరుమల వరకు పాదయాత్ర చేసిన పోతుగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అరుట్ల మహేష్ రెడ్డి,నేడు ముఖ్యమంత్రి జన్మదినాన్నీ పురస్కరించుకుని ఆ ఏడుకొండల వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ముఖ్యమంత్రి గారికి ఉండాలని తిరుమల బయలుదేరి చేరుకొని అలిపిరి నుండి మెట్ల మార్గం గుండా వెళ్లి కలియుగ దైవమైన వెంకటేశ్వర స్వామి దర్శించుకుని ముఖ్యమంత్రి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు,ఈ కార్యక్రమంలో నామాపూర్ గ్రామ సర్పంచ్ మాదాసు అనిల్, కొండాపూర్ మాజీ సర్పంచ్ కరుణాకర్ పాల్గొన్నారు.

గన్నేరువరంలో ఘనంగా ఉదయం అల్పాహారం కార్యక్రమం ప్రారంభం



గన్నేరువరం, నవంబర్ 07 (జనంసాక్షి):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉదయం అల్పాహారం కార్యక్రమాన్ని గన్నేరువరం మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉమ్మడి బెజ్జంకి మార్కెట్ కమిటీ చైర్మన్ మాతంగి శిరీష అనిల్, గ్రామ సర్పంచ్ రంగనవేని లచ్చినర్సు, ఉప సర్పంచ్ రామంచ స్వామి, మండల విద్యాధికారి కె. రామయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు సునీల్, కార్యదర్శి వెంకట్ రెడ్డి కలిసి విద్యార్థులకు అల్పాహారం వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాతంగి శిరీష అనిల్ మాట్లాడుతూ.. పిల్లలు పస్తులతో బడికి రావద్దనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉదయం అల్పాహార కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. విద్యార్థులకు పోషకాహారం అందితేనే చదువుపై శ్రద్ధ పెరుగుతుంది. ఆరోగ్యంగా ఉంటేనే భవిష్యత్తు బాగుంటుంది. ప్రతి విద్యార్థి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పిల్లలే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలి. అందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది. తల్లిదండ్రులు కూడా పిల్లలను ప్రతిరోజూ సమయానికి బడికి పంపాలి అని అన్నారు.మండల విద్యాధికారి కె. రామయ్య మాట్లాడుతూ.. మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఈ కార్యక్రమం అమలు చేస్తున్నాం. నాణ్యమైన,పరిశుభ్రమైన ఆహారం అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఉపాధ్యాయులు, వంట సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలి" అని సూచించారు. సర్పంచ్ రంగనవేని లచ్చినర్సు మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి పిల్లవాడికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తాం.ఈ అల్పాహార కార్యక్రమంతో పిల్లల్లో డ్రాప్ అవుట్స్ తగ్గుతాయి. పాఠశాల అభివృద్ధికి గ్రామ పంచాయతీ ఎప్పుడూ ముందుంటుంది అని అన్నారు.ఉప సర్పంచ్ రామంచ స్వామి మాట్లాడుతూ..ఈ కార్యక్రమం మన ఊరికి రావడం చాలా సంతోషం. పిల్లల ఆరోగ్యం కోసం గ్రామ పంచాయతీ తరపున అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. పాఠశాలకు ఏ అవసరం వచ్చినా మేము ముందుంటాం. పిల్లలు బాగా చదివి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలి అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు సునీల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వం. విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఉదయం అల్పాహారం పథకం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా, ఆనందంగా చదువుకుంటారు. గ్రామ గ్రామాన ప్రభుత్వ పథకాలు ప్రతి పేద కుటుంబానికి అందేలా కాంగ్రెస్ కార్యకర్తలు పని చేస్తారు అని అన్నారు.కార్యదర్శి వెంకటరెడ్డి మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలలు అంటే చిన్నచూపు చూడొద్దు. ఇక్కడే మంచి చదువు, మంచి సంస్కారం లభిస్తుంది. ప్రభుత్వం పిల్లల కోసం మధ్యాహ్న భోజనంతో పాటు ఇప్పుడు ఉదయం అల్పాహారం కూడా పెట్టడం గొప్ప విషయం. తల్లిదండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపాలి అని అన్నారు. అనంతరం విద్యార్థులకు వేడి వేడిగా అల్పాహారం అందజేశారు. పిల్లల సంతోషం చూసి అతిథులు మురిసిపోయారు. చివరగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వచ్చిన అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు సునీల్, కార్యదర్శి వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు, వంట సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్యశోధక్ విద్యార్థిని సత్తా

ఛాంపియన్‌గా నిలిచిన నిజామాబాద్ జట్టులో నర్మల స్నితికా రెడ్డి



సిరికొండ నవంబర్ 7 జనం సాక్షి :రాష్ట్రస్థాయి అండర్-19 బాలికల సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో నిజామాబాద్ జిల్లా జట్టు విజేతగా నిలవగా, ఆ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సత్యశోధక్ పాఠశాల విద్యార్థిని నర్మల స్నితికా రెడ్డి స్వర్ణపతకం సాధించింది.నవంబర్ 04 నుంచి 06 వరకు సిద్ధిపేట జిల్లా గజ్వేల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికల ప్రాంగణం (గర్ల్స్ ఎడ్యుకేషనల్ హబ్)లో తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎ+ఖీ) ఆధ్వర్యంలో 70వ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి అండర్-19 బాలికల సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నిజామాబాద్ జిల్లా బాలికల జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర ఛాంపియన్‌గా నిలిచింది. జట్టు విజయంలో భాగస్వామిగా నిలిచిన స్నితికా రెడ్డి స్వర్ణపతకం కైవసం చేసుకుంది.విజేతగా నిలిచిన నిజామాబాద్ జిల్లా జట్టుకు ముఖ్య అతిథిగా హాజరైన గజ్వేల్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిచేటి చందన రవీందర్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని అందజేశారు.ఈ సందర్భంగా సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య శనివారం పాఠశాలలో స్నితికా రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. క్రీడల్లో నిరంతర సాధన, క్రమశిక్షణ, పట్టుదలతో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పాఠశాలలో చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొని స్నితికా రెడ్డిని అభినందించింది.

సింగరేణి ప్రైవేటీకరణకు ఏఐటీయూసీ, ఐఎన్‌టియుసి వంతపాడుతున్నాయి

టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామ్మూర్తి ఆరోపణ



యైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి)నవంబర్ 7: సింగరేణి సంస్థలో రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం చేపడుతున్న కాంట్రాక్టీకరణ, ప్రైవేటీకరణకు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐ ఎన్ టి యు సి వంతపాడుతున్నాయని టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామ్మూర్తి ఆరోపించారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడాల్సిన సంఘాలు యాజమాన్యం నిర్ణయాలకు మద్దతు ఇవ్వడం ఆందోళనకరమన్నారు. శనివారం 8 ఇంక్లైన్ కాలనీలోని ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రామగుండం ఓసిపి త్రీ లో ప్రైవేట్ డ్రిల్లింగ్ మిషన్‌ను అద్దె ప్రాతిపదికన తీసుకొచ్చి, దాని నిర్వహణ, మరమ్మతుల బాధ్యతలను సైతం ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారని ఆరోపించారు. రెండు డ్రిల్లింగ్ మిషన్లను కాంట్రాక్టు పద్ధతిలో వినియోగిం చేందుకు టెండర్ ప్రక్రియ పూర్తయిందని, మరో నాలుగు డ్రిల్లింగ్ మిషన్ల కోసం టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు.అదేవిధంగా రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు నియోజక వర్గంలోని రామగుండం ఓసిపి-1లో బండ, మట్టి తొలగింపు పనులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారని రామ్మూర్తి ఆరోపించారు. గతంలో సుమారు 1,700 మంది కార్మికులతో కొనసాగిన పనులు, పెరుగుతున్న ప్రైవేటీకరణ కారణంగా ప్రస్తుతం సుమారు 800 మంది కార్మికులతోనే నిర్వహిస్తున్నారని తెలిపారు. సింగరేణిలో వందల కోట్ల రూపాయల విలువైన భారీ యంత్రాలు ఉన్నప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంలో యాజ మాన్యం విఫలమవుతోందని విమర్శించారు. ప్రణాళికాబద్ధంగా పనిచేయక పోవడం, దూరదృష్టి లోపంతో పాటు కూలెంట్, ట్రాన్స్‌మిషన్ ఆయిల్, హైడ్రాలిక్ ఆయిల్, టైర్ల కొరత కారణంగా అనేక భారీ యంత్రాలు పనిచేయకుండా నిలిచిపోయాయని అన్నారు.కార్మికులు విధులు నిర్వహించే దుకు సిద్ధంగా ఉన్నప్పటికీ వారి సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవ డంలో యాజమాన్యం విఫలమవుతోందని రామ్మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ విలేకరుల సమావేశంలో కార్మిక నాయకులు బేతి చంద్రయ్య, మామిడి తిరుపతి,దాసరి శ్రీనివాస్, శశాంక్ బి. శ్రీనివాస్, నరేందర్, మహేందర్, పి. శ్రీనివాస్, దినేష్, దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేటలో ఆస్పత్రి భవనం ప్రారంభించాలని బీజేపీ ధర్నా

ప్రధాన రహదారిపై రాస్తారోకో.. ఆస్పత్రిని వెంటనే ప్రారంభించాలని డిమాండ్



గంభీరావుపేట, నవంబర్ 7, జనం సాక్షి:రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావు పేట మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని వెంటనే ప్రారంభించి ప్రజలకు వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు శనివారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు.మండల బీజేపీ అధ్యక్షుడు కోడె రమేష్ ఆధ్వర్యంలో నాయకులు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఆస్పత్రి భవనం ప్రారంభానికి నోచుకోకపోవడంతో పేద ప్రజలు వైద్య సేవలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులు, నిరుపేదలు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. వెంటనే ఆస్పత్రిని ప్రారంభించి వైద్య సిబ్బందిని నియమించడంతో పాటు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.సమాచారం అందుకున్న తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎస్సై బాలరాజు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ఆస్పత్రి ప్రారంభోత్సవ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో నాయకులు ఆందోళన విరమించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ధార్మిక సెల్ కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, నాయకులు కొక్కు దేవేందర్ యాదవ్, గంట అశోక్, సర్వోత్తమ్, తిరుపతి, శ్రీనివాస్, బండ దేవయ్య, రవి నాయక్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

తాపీ మేస్త్రీలకు శిక్షణ పూర్తి.. ధ్రువపత్రాలు అందజేత



రామగిరి, నవంబర్ 07, (జనంసాక్షి): భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న తాపీ మేస్త్రీల వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు చిలువేరు స్వామి ఆధ్వర్యంలో సెప్టెంబర్ నెలలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (ఎన్.ఏ.సి) శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మేస్త్రీలకు ప్రత్యేక శిక్షణ అందించారు. ఈ శిక్షణలో జిల్లా అధ్యక్షులు చిలువేరు స్వామి పాల్గొన్నారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న తాపీ మేస్త్రీలకు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ జారీ చేసిన ధ్రువపత్రాలను పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు చిలువేరు స్వామి రామగిరి మండలం కల్వచర్లలోని వారి కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగంలో నాణ్యమైన పనులు చేయడానికి నైపుణ్యం ఎంతో అవసరమని తెలిపారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాల ద్వారా ఆధునిక నిర్మాణ పద్ధతులు, పనిలో నాణ్యత, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెరుగుతుందని అన్నారు. కార్మికుల నైపుణ్యానికి గుర్తింపు లభించడంతో పాటు వారి వృత్తిపరమైన అభివృద్ధికి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఎస్కే షరీఫ్, కుసుమ సురేష్, మామిడి కుమార్, వెంగళ రాములు, బైరి శంకర్, ఇటిక్యాల సుధాకర్, జంగిలి తిరుపతి, తన్నీరు విష్ణువర్ధన్, మామిడి సంతోష్, గాదే సారయ్య, ఊదరి సతీష్, గుడ్డేటి ప్రభాకర్, మామిడి కొమురయ్య, పిల్లలమర్రి సంతోష్, ఏల్లే శంకర్, వల్లెపు శీను మేస్త్రీలు శిక్షణ పూర్తి చేసి ధ్రువపత్రాలు అందుకున్న వారిలో ఉన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి



చిగురుమామిడి నవంబర్ 07 (జనంసాక్షి):రైతులకు మద్దతు ధర కల్పించి ,వారు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేయాలనే ప్రభుత్వ సంకల్పంలో భాగంగా శనివారం చిగురుమామిడి మండలం పీచుపల్లి గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నూతన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,చిగురుమామిడి ప్యాక్స్ చైర్మన్ చిట్టుమల్ల రవీందర్,హాజరై రిబ్బన్ కట్ చేసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దళారీల దోపిడీ లేకుండా నేరుగా మద్దతు ధర అందించేందుకే ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.రైతులు పండించిన ధాన్యాన్ని ఏ గ్రేడ్ కు 2461రూపాయలుగా ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకే కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,కొనుగోలు కేంద్రాల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామని వారు పేర్కొన్నారు.అధికారులు,సహకార సంఘాలు సమన్వయంతో పనిచేసి,కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూస్తామని ప్రభుత్వం తరఫున హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పీచు సత్యనారాయణరెడ్డి,ఉపసర్పంచ్ దెంచనోజు సదాచారి,సింగిల్ విండో డైరెక్టర్ పోటు మల్లారెడ్డి,సెంటర్ ఇంచార్జి ఇనుగాల కిష్టారెడ్డి,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పీచు మల్లారెడ్డి,రైతులు గడ్డం ఎల్లారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

విబిజిరామ్ పథకంలోని వ్యవసాయ క్షేత్రంలో ఇంకుడు గింత నిర్మాణం



కథలాపూర్ నవంబర్ 7 (జనం సాక్షి)దేశంలో ఏర్పడిన ఎల్లినో పరిస్థితులను తట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబడిన వి బి జి రామ్ జి పథకం లో జలసిరి ప్రోగ్రాం లో భాగంగా ప్రతి గ్రామంలో ఉన్న ప్రతి వ్యవసాయ క్షేత్రంలో ఒక పంట కుంట అనగా ఫారం పాండు నిర్మించుకోవలసిన అవసరం ఉంది తద్వారా భూగర్భ జలాలను పెంచడంతోపాటు వ్యవసాయ క్షేత్రానికి అవసరమైన నీటిని కూడా అందిస్తుంది. ఇందులో భాగంగా కథలాపూర్ మండలం భూషణ్ రావు పేట గ్రామంలో లబ్ధిదారులు కరుణాకర్ రావు వ్యవసాయ క్షేత్రంలో ఫారం పండు నిర్మించడం జరుగుతుంది . దీనిని పర్యవేక్షణ కొరకు గౌరవ మండల పరిషత్ అభివృద్ధి అధికారి మాలోతు శంకర్ నాయక్ మరియు ఇంజనీరింగ్ కన్సల్టెంట్ శ్రీధర్ మరియు సాంకేతిక సహాయకులు అంబాజీ సందర్శించడం జరిగినది.

శ్రీను బాబుకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ఇనుముల



మంథని, నవంబర్ 07, (జనంసాక్షి) : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబుకు దీపావళి పండుగ సందర్భంగా హైకోర్టు న్యాయవాది, మంథని మాజీ ఉపసర్పంచ్ ఇనుముల సతీష్ తమ కుటుంబ సభ్యులతో కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ లోని సింగరేణి సంస్థ అదనపు న్యాయవాది చందుపట్ల రమణ కుమార్ రెడ్డి ఇంట్లో శ్రీను బాబును కలిసి పలు విషయాలపై చర్చించి, దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో కలిసి పని చేయాలని, ఈ దీపావళి పండుగ రాబోయే రోజుల్లో మరింత వెలుగులు పంచే మంచి రోజులు రావాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది రమణ కుమార్ రెడ్డితో పాటు ఇనుముల సతీష్, ఇనుముల ఉమా మహేశ్వరి, ఇనుముల లాస్యప్రియ తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడద నివారణకు మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు

ఎలుగుబంటి వేషధారణతో కోతులను తరిమే ప్రయత్నం



మంథని, నవంబర్ 07, (జనంసాక్షి): పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపాలిటీ పరిధిలోని గంగాపురి ప్రాంతంలో కోతుల బెడద నివారణకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. కొంతకాలంగా కోతుల సంచారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో వాటిని నివారించేందుకు ఎలుగుబంటి వేషధారణతో కోతులను తరిమే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో గంగాపురి నాలుగో వార్డు కౌన్సిలర్ ఎరుకల స్రవంతి రమేష్ బాబు పాల్గొన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు కోతుల వల్ల ప్రమాదాలకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్న మున్సిపల్ చైర్మన్ పోన్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్‌కు కౌన్సిలర్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ మున్సిపాలిటీ పరిధిలోని సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.

పండుగ పూట విషాదం

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



అంతర్గాం, జనంసాక్షి :పెద్దపల్లి జిల్లా, ఎండపల్లి మండలం, మారేడుపల్లి శివారులో ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొట్టడంతో మహిళ మృతి చెందింది. శనివారం జరిగిన ఈ దుర్ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గోదావరి ఖని నుండి బోట్ల వనపర్తికి భార్యాభర్తలు ఆవుల ప్రణీత, ఆవుల కృష్ణ వెళ్తున్న క్రమంలో ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొంది.తీవ్ర గాయాలతో అల్లాడుతున్న ప్రణీతను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రణీత మృతి చెందింది.గాయాల పాలైన ఆవుల కృష్ణకు పెద్దపెల్లి ప్రభుత్వ ఆసు పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కృష్ణ, ప్రణీత దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.పండుగను పురస్కరించుకొని స్వగ్రామానికి వస్తూ రోడ్డు ప్రమాదంలో ప్రణీత మృతి చెందడంతో బొట్లవనపర్తి గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

ఇందిరమ్మ ఇల్లుకు ముగ్గు పోసిన సిద్దిపల్లె సర్పంచ్



కమాన్ పూర్, నవంబర్ 07, (జనంసాక్షి): పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం సిద్దిపల్లె గ్రామంలో శనివారం నా మని స్వరూప అనే లబ్ధిదారు ఇంది రమ్మ ఇల్లు నిర్మాణం కు గ్రామ సర్పంచ్ బంగారు కళ్యాణి మహేష్ చేతుల మీదుగా ముగ్గు పోశారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసుకుని తమ సొంత ఇంటి కలను సాకారం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

ఎస్సీ, ఎస్టీ యూనియన్ ఎన్నిక

మండల అధ్యక్షులుగా డా.నాగనాథ్



పెద్ద కొడప్గల్ నవంబర్ 07 (జనంసాక్షి): పెద్ద కొడప్గల్ మండల ఉపాధ్యాయుల ఎస్సీ, ఎస్టీ యూనియన్ కమిటీని రాష్ట్ర అధ్యక్షులు కొంగుల వెంకట్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునిగా డాక్టర్ నాగనాథ్, ప్రధాన కార్యదర్శిగా లింగం, కోశాధికారిగా హుస్సేన్, అసోసియేట్ అధ్యక్షునిగా లక్ష్మణ్, గౌరవ అధ్యక్షులుగా యాదవ్, ఉపాధ్యక్షులుగా బాలరాజు, మండల కార్యదర్శిగా మారుతి, బాలరాజు, రాజు, మహిళా సభ్యులుగా సరోజ, విజయలక్ష్మి, సరిత లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీకి రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో సన్మానించి నియామక పత్రాన్ని అందజేశారు. తమపై నమ్మకం ఉంచి నియమించినందుకు డాక్టర్ నాగనాథ్ కృతజ్ఞతలు తెలుపుతూ ఉపాధ్యాయుల సమస్యలను తీర్చుటకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీడీకే.2 సెక్షన్‌లో ప్రత్యేక భద్రతా అవగాహన తరగతులు



గోదావరిఖని, జనంసాక్షి :సింగరేణి ఆర్జీ.వన్ పరిధి జీడీకే 2,2ఏ ఇంక్లైన్‌లోని జీడీకే.2 సెక్షన్‌లో సిమ్యూర్స్ ఏజీఎం విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక భద్రతా అవగాహన తరగతులు శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి కార్మికుడు ఇంటి నుంచే భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, విధి నిర్వహణలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. గనిలో పని చేసే సమయంలో అప్రమత్తంగా ఉంటూ, భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.అలాగే ఇంటి వద్ద గ్యాస్ సిలిండర్లు, విద్యుత్ వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ధూమపానం, మద్యపానం, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండటం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో స్టాట్యూటరీ మేనేజర్ డి. రమేష్ బాబు, మేనేజర్ ఎజ్జగిరి శివయ్య, బ్రాంచ్ సెక్రటరీ రంగు శ్రీను, పిట్ ఇంజనీర్ కోలా మల్లేష్, సేఫ్టీ ఆఫీసర్ ఎం.డి. సల్మాన్ ఖాన్, పిట్ సెక్రటరీ పొన్నాల వెంకటయ్య, వెంటిలేషన్ ఆఫీసర్ జి. కుమారస్వామి, సంక్షేమాధికారి గణేష్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

డిఆర్‌డిఏపిడికి వినతి పత్రం అందించిన సర్పంచుల పోరం అధ్యక్షులు చిగురు నరేష్



ముస్తాబాద్ నవంబర్ 07(జనం సాక్షి) రాజన్న సిరిసిల్ల జిల్లా డి ఆర్ డి ఏ పిడిని లక్ష్మీనారాయణ గారిని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బంధనకల్ గ్రామం లో మహిళా సంఘాల (వివో) భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బంధనకల్ సర్పంచ్ చిగురు నరేష్ కోరడం జరిగింది.అనంతరం వివిధ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు జిల్లా అధికారుల సహకారం అందించి, గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో చికోడు గ్రామ సర్పంచ్ బొమ్మన ఆంజనేయులు, దునుకుల కర్ణాకర్ పాల్గొని తమ గ్రామాల్లోని వివిధ సమస్యలను డి ఆర్ డి ఏ లక్ష్మీనారాయణ గారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.దీనిపై పిడి సానుకూలంగా స్పందిస్తూ, అన్ని గ్రామాల అభివృద్ధికి జిల్లా అధికారుల నుంచి తప్పకుండా సహాయ సహకారాలు అందిస్తామని సర్పంచులకు హామీ ఇవ్వడం జరిగింది.

మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు

- **3,768 ఇందిరమ్మ ఇళ్లలో రేపు దీపావళి సంబరాలు**
- **లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి దీపాలు వెలిగించనున్న ప్రజాప్రతినిధులు, అధికారులు**



కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 7 (జనం సాక్షి)కామారెడ్డి జిల్లావ్యాప్తంగా ఆదివారం 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా పూర్తయిన 3,768 ఇళ్లలో ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు.జిల్లాకు ప్రభుత్వం ఇప్పటివరకు 16,163 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా, వాటిలో 3,768 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసిన అనంతరం లబ్ధిదారులు తమ కొత్త ఇళ్లలో జరుపుకుంటున్న తొలి దీపావళిని ఆనందోత్సాహాల మధ్య నిర్వహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. పూర్తయిన ప్రతి ఇందిరమ్మ ఇంటి ముందు లోగోలు ఏర్పాటు చేయడంతో పాటు, లబ్ధిదారుల వివరాలను ప్రదర్శించనున్నారు. లబ్ధిదారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి ముందు ప్రమిదలు వెలిగించి పండుగ జరుపుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు లబ్ధిదారుల ఇళ్లను సందర్శించి కుటుంబాలతో కలిసి దీపాలు వెలిగించనున్నారు. ఇందిరమ్మ ఇళ్లతో పేద కుటుంబాల జీవితాల్లో వచ్చిన మార్పులను తెలుసుకోనున్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలని సూచించారు.

బీవీఎం జిల్లా కన్వీనర్‌గా రోహిత్.. కో-కన్వీనర్‌గా భానుప్రసాద్



కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 7 (జనం సాక్షి) భారతీయ విద్యార్థి మోర్చా (బీవీఎం) కామారెడ్డి జిల్లా నూతన కమిటీని ప్రకటించారు. బీవీఎం రాష్ట్ర అధ్యక్షులు భూంపల్లి రవితేజ ఆధ్వర్యంలో, బాంసెఫ్ రాష్ట్ర అధ్యక్షులు దుబాసి నరేందర్, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల బాబు, జిల్లా అధ్యక్షులు గంగారం సమక్షంలో నూతన కమిటీని నియమించారు.ఈ నియామకాల్లో జిల్లా కన్వీనర్‌గా రోహిత్, కో-కన్వీనర్‌గా భానుప్రసాద్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 'నా చదువు -- నా సమాజం కోసం' అనే నినాదంతో విద్యార్థుల్లో సామాజిక చైతన్యం పెంపొందించడమే బీవీఎం లక్ష్యమని తెలిపారు. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను విద్యార్థులకు పరిచయం చేస్తూ, వారి సమస్యలు, హక్కుల సాధన కోసం దేశవ్యాప్తంగా పోరాటం చేస్తున్నట్లు పేర్కొన్నారు.నూతనంగా నియమితులైన రోహిత్, భానుప్రసాద్‌లు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సతీష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాల వెలుగులో లిటిల్ స్కాలర్స్ దీపావళి వేడుకలు

బొమ్మల కొలువుతో అలరించిన విద్యార్థులు.. సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట



కామారెడ్డి, నవంబర్ 7 (జనం సాక్షి)కామారెడ్డి పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ హైస్కూల్‌లో దీపావళి పండుగను పురస్కరించుకుని ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ సంబరాలు సంప్రదాయాలు, సాంస్కృతిక వైభవం ఉట్టిపడేలా సాగాయి.ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని రంగురంగుల పూలు, అలంకరణలు, దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన సంప్రదాయ బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ దేవతా మూర్తుల విగ్రహాలు, సంప్రదాయ బొమ్మలు, అలంకరణ వస్తువులను క్రమ పద్ధతిలో అమర్చడంతో పాఠశాల ఆవరణలో పండుగ శోభ సంతరించుకుంది.ఈ సందర్భంగా విద్యార్థులకు దీపావళి పండుగ ప్రాముఖ్యతను, దాని వెనుక ఉన్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక విశేషాలను వివరించారు. చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి దీపావళి ప్రతీక అని తెలియజేశారు. బొమ్మల కొలువు ద్వారా భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని విద్యార్థులకు పరిచయం చేశారు.విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు మన సంస్కృతి, ఆచార వ్యవహారాలు, పండుగల విశిష్టతను తెలియజేయడం ద్వారా వారిలో విలువలను పెంపొందించవచ్చని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఇటువంటి కార్యక్రమాలు చిన్నారుల్లో సాంస్కృతిక అవగాహనతో పాటు సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంచుతాయని తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ పున్న అరుణ ఉపాధ్యాయులు, సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ పున్న అరుణ, కరస్పాండెంట్ పున్న రాజేష్, ప్రిన్సిపాల్ స్వాతిప్రియ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు.సంప్రదాయ బొమ్మల కొలువు, దీపాల అలంకరణలు, విద్యార్థుల సందడితో లిటిల్ స్కాలర్స్ హైస్కూల్‌లో దీపావళి సంబరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి

నిరుపేద ముస్లిం కుటుంబానికి అండగా నిలిచిన వ్యాళ్ల హరీష్ రెడ్డి

దివ్యాంగుడి కుమార్తె వివాహానికి రూ.10 వేల ఆర్థిక సహాయం



అంతర్గాం, జనంసాక్షి :గోదావరిఖని అడ్డగుంటపల్లి స్వతంత్ర చౌక్‌కు చెందిన దివ్యాంగ నిరుపేద సర్వర్ పాషా కుమార్తె సుభాని వివాహం సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాళ్ళ హరీష్ రెడ్డి ఆదేశాల మేరకు రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. రామగుండం కార్పొరేషన్ మాజీ కో-ఆప్షన్ మెంబర్ తస్నిమ్ భాను చేతుల మీదుగా ఈ ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది.ఈ సందర్భంగా తస్నిమ్ భాను మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గంలో పేద ముస్లిం కుటుంబాలకు కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన షాదీ ముబారక్ పథకం ప్రస్తుతం నిలిచిపోయినప్పటికీ, నిరుపేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరగాలనే ఉద్దేశంతో వ్యాళ్ళ హరీష్ రెడ్డి తన వంతు సహాయంగా రూ.10,000 అందించినట్లు తెలిపారు.అదేవిధంగా ప్రతి సంవత్సరం పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా దాదాపు 600 మంది ముస్లింలకు రంజాన్ తోఫా అందిస్తూ, ముస్లిం మైనార్టీల సంక్షేమానికి అండగా నిలుస్తున్న వ్యాళ్ళ హరీష్ రెడ్డి ముస్లిం సమాజానికి ఆత్మబంధువుగా మారారని పేర్కొన్నారు. పేద కుటుంబాల కష్ట సుఖాల్లో భాగస్వాములవుతూ, ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి జహీద్ పాషా, మైనార్టీ నాయకులు హసేన్ చిస్తీ, జాఫర్, రాజ్ మహమ్మద్, మున్వార్ తదితరులు పాల్గొన్నారు.పేదల సంక్షేమమే లక్ష్యంగా, ప్రజల కష్టాల్లో అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న వ్యాళ్ళ హరీష్ రెడ్డి సేవలను పలువురు అభినందించారు.

ఓటరు జాబితాలో పేరు నమోదుకు మరో అవకాశం

నవంబర్ 21వ తేదీ వరకు ఎన్యుమరేషన్ ఫారాలు అందించవచ్చు

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



రాజన్న సిరిసిల్ల బ్యూరో, నవంబర్ 07(జనం సాక్షి);ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ -2026 ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించినట్లు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు.ఎస్ ఐ ఆర్ ప్రక్రియ, ఎన్యుమరేషన్ ఫారాల స్వీకరణ, ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయడం, గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన ఓటర్ల వివరాలపై శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. భారత ఎన్నికల సంఘం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా మరో ఏడు రాష్ట్రాల్లో ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించిందని తెలిపారు.ఈ అవకాశంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని వారు మరోసారి తమ ఫారాలను సమర్పించేందుకు అవకాశం కల్పించిందని తెలిపారు. గైర్హాజరు, చిరునామా మార్పు, మరణం తదితర కారణాలతో ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.నవంబర్ 21వ తేదీ వరకు ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించవచ్చని తెలిపారు.ఇప్పటికే ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన (ఏ ఎస్ డి) ఓటర్ల వివరాలను పోలింగ్ కేంద్రాల వారీగా జాబితాల రూపంలో ప్రదర్శించాలని ఆదేశించారు. జాబితాలో చేర్చకపోవడానికి గల కారణాలను కూడా స్పష్టంగా పేర్కొనాలని తెలిపారు.అలాగే ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లో కూడా పోలింగ్ కేంద్రాల వారీగా అందుబాటులో ఉంచాలని సూచించారు.ఓటర్లు తమ పాత ఎపిక్ నంబర్ ఆధారంగా ఎన్నికల సంఘం వెబ్‌సైట్, ఈసీఐనెట్ యాప్ ద్వారా కూడా ఎన్యుమరేషన్ ఫారాలను డౌన్‌లోడ్ చేసుకుని సమర్పించవచ్చని తెలిపారు.రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు.ఇట్టి వీడియో కాన్ఫరెన్స్ లో తహసీల్దార్లు మహేష్, జయంత్, ఎలక్షన్ సెక్షన్ అధికారి రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి కార్పొరేటర్ వినతి

అధికారుల సానుకూల స్పందన



కరీంనగర్ టౌన్, నవంబర్ 07, (జనం సాక్షి) దుర్శేడ్ 4వ డివిజన్‌లోని ఎస్సీ కాలనీ హనుమాన్ టెంపుల్ నుంచి ఎస్సీ కాలనీ వరకు సుమారు 600 మీటర్ల మేర రోడ్డు గుంతలు పడి పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నూతన తారు రోడ్డు నిర్మించాలని కార్పొరేటర్ భూపతి రవీందర్, శ్రీధర్ రోడ్లు భవనాల శాఖ ఏఈకి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంపై అధికారులు సానుకూలంగా స్పందించి, వెంటనే సంబంధిత అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. సమస్యపై వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టిన ఆర్ అండ్ బీ అధికారులకు కార్పొరేటర్ భూపతి రవీందర్, శ్రీధర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రెండో రోజు మేటీలకు శిక్షణ కార్యక్రమం

ఉపాధి పనులపై అవగాహన.. క్షేత్రస్థాయిలో పరిశీలన



గంభీరావుపేట, నవంబర్ 7, జనం సాక్షి:రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని నర్మాల రైతు వేదికలో ఎంపీడీవో రాజేందర్ అధ్యక్షతన రెండో రోజు మేటీల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల ఉపాధి హామీ పనులపై మేటీలకు అవగాహన కల్పించారు.శిక్షణలో భాగంగా మేటీలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి పనుల నిర్వహణ, కొలతలు, మాస్టర్ నిర్మాణానికి సంబంధించిన అంశాలపై ప్రత్యక్షంగా వివరించారు. పనుల కొలతలు ఎలా తీసుకోవాలి, రికార్డుల నిర్వహణ ఎలా ఉండాలి అనే విషయాలను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్, ఏపీవో అరుణ, ఈసీ శ్రీహరి, టెక్నికల్ అసిస్టెంట్లు భార్గవ చారి, శ్రీవాణి, నవీన్, కంప్యూటర్ ఆపరేటర్ చారి, ఫీల్డ్ అసిస్టెంట్లు ఎర్రోళ్ల శంకర్, మహేష్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన మేటీలు పాల్గొన్నారు.

చందనోత్సవ ఏర్పాట్లు పరిశీలన



మల్యాల నవంబర్ 7 (జనం సాక్షి) తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మల్యాల మండలం ముత్యంపేట గ్రామంలోని కొండగట్టు దేవస్థానంలో అత్యంత వైభవంగా జరగనున్న శ్రీ ఆంజనేయస్వామి స్వామి చందనోత్సవ ఏర్పాట్లను శనివారం ఈవో అంజనా రెడ్డి మరియు ఈఈ రాజేష్ పరిశీలించి భక్తులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు,ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

అల్లం బుచ్చమ్మ పార్థీవ దేహానికి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు



మంథని, నవంబర్ 07,(జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లా మంథని మండలం గాజులపల్లి గ్రామంలో ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, రిటైర్డ్ టీచర్, రచయిత అల్లం వీరయ్య, కవి, రచయిత అల్లం రాజయ్య తల్లి అల్లం బుచ్చమ్మ మృతి చెందగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ పూల మాల వేసి నివాలర్పించారు. ఈ సందర్భంగా కొత్త శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కొండ శంకర్, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఎక్కేటి అనంత రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆకుల కిరణ్, మాజీ వైస్ ఎంపీపీ కొమ్మిడి స్వరూప్, తదితరులు అల్లం బుచ్చమ్మ మృతి పట్ల నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అల్లం రాజయ్య, అల్లం వీరయ్య, అల్లం నారాయణలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.అదే విధంగా మంథని పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ పెండ్యాల రాంకుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

రైతంగ పోరాటాలలో ఎర్రన్న పాత్ర కీలకమైనది

కామ్రేడ్ అగ్గు ఎర్రన్న కుటుంబాన్ని పరామర్శించిన అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిడాల భిక్షపతి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 8 జనం సాక్షి:రైతాంగ ఉద్యమంలో ఎర్రన పాత్ర ఎనలేనిదనీ ,1980 దశకంలో ఫారెస్ట్ అధికారుల జులుం కు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప వ్యక్తి ఎర్రన్న అని రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్షపతి అన్నారు శనివారం ఆయన స్వగ్రామం మోపాల్ లో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతాంగ ఉద్యమంలో ఎర్రన పాత్ర ఎనలేనిది అన్నారు. 1980 దశకంలో ఫారెస్ట్ అధికారులు జులుం కు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. ఆ తర్వాత భూమి కోసం, కూలి రేట్లు పెంపు,గిట్టుబాటు ధరలు సాగునీరు, విద్యుత్ కోసం జరిగిన అనేక పోరాటాలలో ఆయన భాగం అయ్యారన్నారు.సాధారణ కార్యకర్తగా ప్రారంభమై జిల్లా రాష్ట్ర స్థాయి నాయకులుగా ఎదిగారన్నారు. నాలుగు దశాబ్దాలకు పై నిర్విరామంగా పోరాడారన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిరంతరం ఆలోచించి పరిష్కారానికి మార్గాన్ని వెతికే వారన్నారు.ఆయన పోరాటస్ఫూరితో ప్రజా ఉద్యమాలు నిర్మిద్దామని వారన్నారు.ఈ సందర్భంగా వారి కుటుంబాన్ని పరామర్శించి వారి ధైర్యాన్ని కోల్పోకూడదని మేమంతా అండగా ఉంటామని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి కే సాయన్న,రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్య నర్సయ్య, బి సాయిలు, జిల్లా నాయకులు ఎల్ పర్వయ్య, నాయకులు అగ్గు చిన్నయ్య,డి బన్నికే అనంతయ్య, బుర్రి గంగాధర్,సచిన్, తుంగపల్లి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యకాంతుల దీపావళి నేడు నరక చతుర్దశి

చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నం



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 7 జనం సాక్షి:భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా వెలుగొందేవి భారతీయ పండుగలు. అందరూ సమైక్యంగా జరుపుకునే పండగే దివ్య దీప్తుల దీపావళి.ఆశ్వయుజ బహుళ చతుర్దశినే నరక చతుర్దశి అంటాం. ఈ నరక చతుర్దశి తర్వాతి రోజే దీపావళి. మనం ఆచరించే పండుగలలో ఒక రాక్షసుడి మరణాన్ని ఆనందంగా పండుగ చేసుకోవడం -- నరక చతుర్దశి విశిష్టత. నరక చతుర్దశి ఆచరణ వెనక ఉన్న గాథల్లో నరకాసురుడి గాథ ప్రధానమైంది. హిరణ్యాక్షుడు లోకానికి ఉపద్రవంగా భూదేవిని చుట్టచుట్టి సముద్రంలో ముంచినప్పుడు విష్ణుమూర్తి వరాహావతారమెత్తి, ఆ రాక్షసుని సంహరించి భూదేవిని ఉద్ధరించాడు. ఆ సందర్భంగా భూదేవికి విష్ణుమూర్తి వరప్రసాదం వలన భీముడనే పుత్రుడు జన్మించాడు. అతనే దుర్మార్గుడైన నరకాసురునిగా పేరొందాడు. దురదృష్టవశాత్తు నరకుడు అసుర ప్రభావంలోపడి ఘోరతపస్సు చేసి అనేక వరాలు పొందాడు. వరుణ ఛత్రాన్ని అపహరిస్తే శ్రీకృష్ణుడు ఇతనిని ద్వంద్వయుద్ధంలో ఓడించి, వాటిని తిరిగి అదితికి అందజేశాడు.రొకప్పుడు మదపుటేనుగు రూపంలో విశ్వకర్మ పుత్రికను చెరపట్టాడు. వీరూ వారనే విచక్షణ లేకుండా గంధర్వ, దేవ, మానవ కన్యలను బలవంతంగా అపహరించి, తన చెరలో ఉంచడం ఇతనికొక వ్యసనం. ఇతని దౌర్జన్యాలు అంతటితో ఆగక చివరకు ఇంద్రునిపైకి దండెత్తి ఆయన అధికార ముద్రను అపహరించడంతో ఈ అసుర ప్రముఖుని దురంతం పరాకాష్టనందుకుంది. ఇంద్రుడు ఆపద రక్షకుడైన శ్రీ కృష్ణుని శరణు వేడగా గోపాలుడు నరకునిపై దండెత్తాడు. అయితే నరకాసురుని విషపు బాణానికి శ్రీ కృష్ణుడు ఒక క్షణంపాటు నిశ్చేష్టుడయ్యాడు. అది గమనించి ఆయన వెన్నంటే ఉన్న ఆయన సతీమణి సత్యభామ ఉగ్రురాలై భయంకరమైన తన బాణాలతో అతడిని నిలువరించింది.సాయంకాలం ఇంట్లోని దేవుడి మందిరంలోనూ, ఏదైనా దేవాలయంలోనూ దీపారాధన చేయటం శుభప్రదం. చతుర్దశినాడు దీపదానం చేస్తే పితృదేవతలందరికీ స్వర్గనివాసం కలుగుతుందని విశ్వాసం. సాయం సమయంలో నూనెతో తడిపిన, రసాయన ద్రవ్యాలతో తయారుచేసిన కాగడాలను చేతబట్టుకొని తిరిగినట్లయితే పితృదేవతలకు దారి చూపినట్లవుతుందనీ విశ్వాసం. దీపావళికి ముందు రోజు నరక చతుర్దశి పండుగను ఘనంగా జరుపుకుంటారు.

తబితా ఆశ్రమ పిల్లల ముఖాల్లో వెలుగులు

- పిల్లలకు దామెర చారిటబుల్ ట్రస్ట్ అండగా..
- దీపావళి వేడుకలు డాక్టర్ అనిల్ కుమార్..

అంతర్గాం, జనంసాక్షి :

దీపావళి అంటేనే వెలుగుల పండుగ. జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించే పండుగ. ఈ పండుగ వేళ అందరి ముఖాల్లో నవ్వులు మతాబుల్లా వెలగాలని దామర చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ అనిల్ కుమార్ దామర అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాలు, పేదల ముఖాల్లో చిరునవ్వు చూసేందుకు మంచి మనసులు ఎప్పుడూ ముందుంటారని, పర్యావరణానికి తోడుగా నిలుస్తూ పండుగ వేళ ఆనందపు వెలుగులు నింపేందుకు ఎంతోమంది కృషి చేస్తుంటారన్నారు. కుల, మత భేదాలు లేకుండా భారతదేశ ప్రజ లందరూ కలిసి జరుపుకునే ఒక అపూర్వ పండుగ దీపావళి. పండుగను కుటుంబ సమేతంగా పెద్దలు, పిల్లలు అందరూ కలిసి జరుపుకుంటార న్నారు. అలాంటి సంతోషమైన పండుగ, వెలుగులను పంచే పండుగ దీపావళిని రామగుండం తబితా ఆశ్రమంలో నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు.ఎంతో మంది



చిన్నారులు తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా ఉన్నారని, వారందరి కోసం దామర చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని, రామగుండం తబితా ఆశ్రమానికి తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని వారు అన్నారు.ఇక నుండి ప్రతి సంవత్సరం దీపావళి రోజున అనాథ ఆశ్రమంలో ఉన్న పిల్లలను కలిసి, వారిని సొంత కుటుంబ సభ్యులుగా చేరదీసి, వారితో దీపావళి పండుగను జరుపుకుంటామన్నారు. తబితా ఆశ్రమ పిల్లలతో కలిసి దీపావళి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆశ్రమ నిర్వాహకులను అభినందించారు. అనంతరం ఖనిలోని సంజయ్ గాంధీ నగర్ లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టపాకాయలు అందించారు.ఈ కార్యక్రమంలో ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్, వై. లెనిన్, ఆశ్రమ నిర్వాహకులు వీరేందర్ నాయక్, విమల పాల్గొన్నారు.

చిన్నచిన్న వీధుల్లో అంబులెన్స్ వెళ్లేలా రహదారులు

నగర మేయర్ మహంకాళి స్వామి

వీధి లైట్లు తదితర అన్ని మౌళిక వసతులు కల్పించాలనే ఎం ఎల్ ఎ రాజ్ ఠాకూర్ లక్ష్యం మేరకు అన్ని డివిజన్ ల లోనూ పనులు జరుగుతున్నాయని అన్నారు. నాణ్యత తో పనులు పూర్తయ్యేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ముస్తాఫా , అడ్డాల గట్టయ్య , డేవిడ్ రాజు,నాయకులు రాజేందర్ , మారెల్లి రాజిరెడ్డి , ధరణి జలపతి నగర పాలక సంస్థ ఎ ఇ తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

ఇందుర్తి అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా బాలుడి పుట్టినరోజు వేడుకలు

కేక్ కట్ చేసి పిల్లలకు ప్లేట్ల పంపిణీ..



చిగురుమామిడి నవంబర్ 07 (జనంసాక్షి):

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలోని చింతలపల్లి అంగన్వాడి కేంద్రంలోని బాలుడి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి.గ్రామానికి చెందిన ఎంబరి కల్పన-సంపత్ దంపతుల కుమారుడు ఎంబరి రియాన్స్ పుట్టినరోజును పురస్కరించుకొని అంగన్వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలోని ప్రీ-స్కూల్ పిల్లల సమక్షంలో బాబు రియాన్స్‌తో కేక్ కటింగ్ చేయించారు.అనంతరం కల్పన-సంపత్ దంపతులు తమ స్వంత ఖర్చులతో అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులందరికీ భోజన ప్లేట్లను పంపిణీ చేశారు.రియాన్స్ పుట్టినరోజు వేడుకను అంగన్వాడీ కేంద్రంలోని పిల్లల మధ్య జరుపుకుంటూ వారికి ఉపయోగపడే వస్తువులను అందజేయడం అభినందనీయమని అంగన్వాడీ టీచర్లు, గ్రామస్తులు కల్పన-సంపత్ దంపతులను అభినందించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ గాండ్ల ఇందిర,చిన్నారుల తల్లిదండ్రులు, ప్రీ-స్కూల్ పిల్లలు పాల్గొన్నారు.



గిరిజనుల చిరకాల ఆకాంక్ష నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపిన నాయకులు

సైదాపూర్ నవంబర్ 7 (జనం సాక్షి)

మండలం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం తెలంగాణ రాష్ట్రంలో గిరిజనుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి, రాష్ట్ర బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు కాంగ్రెస్ పార్టీ నాయకులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయడం గిరిజన సమాజానికి ఎంతో మేలు చేసే నిర్ణయమని, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి ఈ కమిషన్ ఎంతగానో దోహదపడుతుందని నాయకులు పేర్కొన్నారు.గిరిజనుల హక్కులు, విద్య, వైద్యం, ఉద్యోగాలు, భూమి సమస్యలు, సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న ఇబ్బందుల పరిష్కారానికి ఎస్టీ కమిషన్ ఒక బలమైన వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.గిరిజనుల అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తూ ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా గిరిజనుల సంక్షేమానికి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వానోత్ కిషన్ నాయక్, సర్పంచ్ శంకర్ నాయక్, భాస్కర్ నాయక్, రవి నాయక్, రాము నాయక్, తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు తప్పనిసరిగా చెల్లించాలి

లైసెన్సుల నమోదు, సకాలంలో నవీకరణ చేపట్టాలి

సహాయ కార్మిక కమిషనర్ డాక్టర్ శశి కుమార్..

కామారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 7 (జనంసాక్షి)

జిల్లా వ్యాప్తంగా దుకాణాలు, వాణిజ్య సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలను తప్పనిసరిగా చెల్లించాలని సహాయ కార్మిక కమిషనర్ డాక్టర్ ఎం. శశి కుమార్ సూచించారు. గురువారం సహాయ కార్మిక కమిషనర్ కార్యాలయం ఆధ్వర్యంలో దుకాణాలు, వాణిజ్య సంస్థల యజమానులకు కనీస వేతనాల చట్టం అమలు, కార్మిక లైసెన్సుల నమోదు, నవీకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంస్థ యజమాని తమ వద్ద పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలు చెల్లించడంతో పాటు, కార్మికుల హక్కులను పరిరక్షించే చట్ట నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. తెలంగాణ దుకాణాలు, సంస్థల చట్టం ప్రకారం సంస్థల నమోదు పూర్తి చేసి, లైసెన్సులు పొందాలని, గడువు ముగియకముందే వాటిని నవీకరించుకోవాలని సూచించారు. కార్మికులకు నిర్దేశిత పని గంటలు, వారాంతపు సెలవులు, ఇతర చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ యజమానుల బాధ్యత అని పేర్కొన్నారు.





న్యూ మిలీనియం ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ట్రూత్ అబౌట్ డ్రగ్ కార్యక్రమం

జమ్మికుంట, నవంబర్ 7 (జనంసాక్షి):

యునైటెడ్ నేషనల్ ఓటర్ సోషల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం జమ్మికుంట పట్టణంలోని న్యూ మిలీనియం ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ట్రూత్ అబౌట్ డ్రగ్ అనే కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులకు డ్రగ్స్ పైన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డ్రగ్స్ వినియోగం వలన వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా,సమాజపరంగా అనేక తీవ్రమైన నష్టాలు కలుగుతాయని, పిల్లల్లో డ్రగ్స్ ఉపయోగించడం వలన అనేక దుష్ఫలితాలు కలుగుతాయని, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి డ్రగ్స్ కు ఈ వయసునుండే దూరంగా ఉండాలని నేషనల్ స్పోర్ట్స్ పర్సన్ డాక్టర్ ఏన్ దిలీప్ రావు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎం. హేమలత స్థానిక ఎస్ఐ ఎన్ రవి, న్యూ మిలీనియం స్కూల్ కరస్పాండెంట్ ముసిపట్ల తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ విశ్వనాథ్ రెడ్డి, తెలంగాణ అధికార ప్రతినిధి కొంగంటి రాజ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర సెక్రెటరీ మీసాల విజయ్, హుజురాబాద్ కాన్స్టిట్యూషన్ ప్రెసిడెంట్ చెరుకు పైదయ్య,జమ్మికుంట మున్సిపాలిటీ ప్రెసిడెంట్ బైరి రవీందర్,పర్లపల్లి వెంకటేశ్వర్లు, సామల లావణ్య పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునేలా ఆరుతడి పంటల సాగు చేపట్టాలి

కల్వచర్లలో రైతులకు అవగాహన కార్యక్రమం

రామగిరి, నవంబర్ 07, (జనంసాక్షి) :

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం రైతులకు ఆరుతడి పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్, కేవీకే శాస్త్రవేత్త వినోద్ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోయే అవకాశం ఉండటంతో పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు నీటి వినియోగాన్ని తగ్గిస్తూ పెసలు, నువ్వులు, మినుములు, కుసుమలు వంటి ఆరుతడి పంటలను ప్రత్యామ్నాయంగా సాగు చేయాలని సూచించారు. అలాగే ఆయిల్‌పామ్ సాగు విధానాలు, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీల గురించి వివరించారు. రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులను ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి మాట్లాడుతూ.. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల సాగులో మార్పులు చేసుకోవాలని, తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సేంద్రీయ ఎరువులు రైతులకు సులభంగా అందుబాటులో ఉండేలా ఫెర్టిలైజర్ డీలర్ల వద్ద వాటిని అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద రైతులకు పశువుల మేత సాగు చేసుకునే సదుపాయం అందుబాటులో ఉందని, పశువుల కోసం నీటి తొట్టెల నిర్మాణ సౌకర్యం కూడా ఉందని వివరించారు.ఇంకుడు గుంతల నిర్మాణం, వాటి ఉపయోగాలపై కూడా రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అరవింద్, పీఏసీఎస్ డైరెక్టర్ సైండ్ల సత్యనారాయణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నలంద హైస్కూల్‌లో ఘనంగా దీపావళి వేడుకలు

ఆర్మూర్,నవంబర్ 7(జనంసాక్షి):

ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి నలంద హైస్కూల్‌లో దీపావళి పండుగ వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతో ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణంతో కళకళలాడింది. విద్యార్థులకు దీపావళి పండుగ యొక్క విశిష్టత, ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు వివరించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి, చీకటిపై వెలుగు సాధించిన విజయానికి దీపావళి ప్రతీక అని తెలియజేశారు.విద్యార్థులు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను తెలుసుకునేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని కాలుష్య రహితంగా, సురక్షితంగా దీపావళి జరుపు కోవాలని విద్యార్థులకు సూచించారు.ఈ వేడుకలు విద్యార్థుల్లో ఆనందాన్ని, ఐకమత్యాన్ని, సాంస్కృతిక విలువలను పెంపొందించాయి. ఈ సందర్భంగా అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల,విద్యార్థులు పాల్గొన్నారు.



రుద్రంగి మండల కేంద్రంలోని ఘనంగా కృష్ణవేణి హైస్కూల్‌లో ముందస్తు దీపావళి వేడుకలు

రుద్రంగి, నవంబర్ 7 (జనం సాక్షి)

రుద్రంగి మండల కేంద్రంలో గల కృష్ణవేణి హైస్కూల్‌లో శనివారం ముందస్తు దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణ మొత్తం రంగురంగుల దీపాలు, ముగ్గులు, బాణాసంచా అలంకరణలతో దీపావళి శోభను సంతరించుకుంది.ఈ వేడుకలకు పాఠశాల ప్రిన్సిపాల్ హరినాథ్ రాజ్, కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్లు తీపి రెడ్డి వెంకట్ రెడ్డి, ఎర్రం గంగా నరసయ్య, పడాల సురేష్ లు హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దీపావళి అంటే చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీక అని, విద్యార్థులు జీవితంలో అజ్ఞానమనే చీకటిని తొలగించుకుని జ్ఞానమనే వెలుగులను నింపుకోవాలని సూచించారు. చిన్నారులు పటాకులు కాల్చే సమయంలో తల్లిదండ్రుల పర్యవేక్షణలోనే, జాగ్రత్తలు పాటిస్తూ పండుగను సురక్షితంగా జరుపుకోవాలని అవగాహన కల్పించారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారులు దీపావళి పండుగ విశిష్టతను తెలియజేసే నృత్యాలు, పాటలు, చిన్న చిన్న నాటికలతో అలరించారు. లక్ష్మీదేవి వేషధారణలో వచ్చిన చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.వేడుకల్లో భాగంగా విద్యార్థులకు స్వీట్లు పంపిణీ పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





జంబి హనుమాన్ ఆలయంలో అన్నదానం

ఆర్మూర్,నవంబర్ 7(జనంసాక్షి):

ఆర్మూర్ పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయంలో భక్తిశ్రద్ధలతో శనివారం పూజలు నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామి వారి ఆశీస్సులతో ఆలయానికి విచ్చేసే భక్తులకు అన్నదాన ప్రసాదం అందించారు.ఈ పవిత్రమైన సేవా కార్యక్రమంలో భక్తులు, దాతలు, సేవాభావం కలిగిన ప్రతి ఒక్కరూ భాగస్వాములైనారు.కార్యక్రమంలో హనుమాన్ ఆలయ కమిటీ డైరెక్టర్ దొండి రమణ,అన్న ప్రసాద వితరణ దాత తమ్మి శ్రీనివాస్,ఆలయ కార్యనిర్వాహణాధికారి రఘునాథ్, చైర్మన్ రేగుల సత్యనారాయణ మిగతా డైరెక్టర్లు,సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

అంగరంగ వెభవంగా దీపావళి సంబరాలు

ఆర్మూర్, నవంబర్ 7 (జనంసాక్షి):

ఆర్మూర్ పట్టణంలోని నారాయణ పాఠశాలలో ఘనంగా దీపావళి సంబరాలు జరుపుకొన్నామని పాఠశాల ప్రిన్సిపాల్ రజని కుమారి తెలిపారు.ఈ సంబరాల్లో భాగంగా విద్యార్థిని, విద్యార్థులు సాంప్రదాయమైన దుస్తులతో విచ్చేసారని విద్యార్థులు ఉపాధ్యాయులందరూ బాణసంచా,టపాసులు పేల్చారు.ఈ వేడుకలకు తెలంగాణా నారాయణ విద్యా సంస్థల జిఎం గోపాల్ రెడ్డి,డిజిఎం వెంకట రమణ రెడ్డి, నిజామాబాద్ జోన్ ఏజిఎం శివాజీ ముఖ్య అతిథులుగా విచ్చేసి దీపావళి పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు చక్కగా వివరించారు.నారాయణ పాఠశాలలు చదువుతో పాటు సాంప్రదాయాలకు కూడా విలువలను ఇచ్చే విధంగా బోధింపబడుతున్నాయని తెలిపారు.ఈ ఉత్సవాలలో పాఠశాల జోనల్. కో-ఆర్డినేటర్స్ రాకేష్,అజీమా,కల్పన,డీన్.సంతోష్, శైలజ, స్రవంతి,ఏవో నవీన్,పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.



గంభీరావుపేట మండల ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

ప్రజలందరూ సుఖసంతోషాలతో పండుగ జరుపుకోవాలి: సయ్యద్ సాదిక్

గంభీరావుపేట, నవంబర్ 7, జనంసాక్షి:



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని గ్రామ, పట్టణ ప్రజలకు టీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ సాదిక్ దీపావళి పండుగ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటామని పేర్కొన్నారు. ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు. ప్రతి ఇంటా సిరిసంపదలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని అన్నారు. ప్రజల మధ్య ప్రేమ, ఆప్యాయతలు, ఐక్యత మరింత పెరగాలని కోరుకున్నారు. దీపావళి వెలుగులు ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని సయ్యద్ సాదిక్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ దృష్టిలో ఉంచుకొని కాలుష్య రహితంగా తగిన భద్రత జాగ్రత్తలు పాటిస్తూ పండుగను జరుపుకోవాలని మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ముదిరాజ్ సమరభేరిని విజయవంతం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీలో ఈనెల 12న భారీ కార్యక్రమం

ఓయూ విద్యార్థిని అనిత ముదిరాజ్

గంభీరావుపేట, నవంబర్ 7, జనంసాక్షి:

ముదిరాజుల హక్కుల సాధన కోసం ఈనెల 12న ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న సమరభేరిని విజయవంతం చేయాలని ఓయూ విద్యార్థిని నాయకురాలు అనిత ముదిరాజ్ పిలుపునిచ్చారు. శనివారం గంభీరావుపేట మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు శాత్రబోయిన లక్ష్మణ్ ఆధ్వర్యంలో సమరభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనిత ముదిరాజ్‌తో పాటు పలువురు ముదిరాజ్ నాయకులు మాట్లాడారు. ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముదిరాజ్ ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రూ.20 కోట్లు కేటాయించాలని కోరారు. రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో తగిన రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. 50 ఏళ్లు నిండిన మత్స్యకారులకు పెన్షన్లు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముదిరాజుల హక్కుల సాధన కోసం చేపట్టే ఈ పోరాటానికి రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, పీఏసీఎస్ చైర్మన్ చొప్పదండి రామచంద్రం, పర్శ హన్మండ్లు, పిట్టల భూమేష్, వెంకటస్వామి, వెంకటేశ్వర్లు తదితర ముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు.



కోరేం ప్రాథమిక పాఠశాలను సందర్శించిన మండల విద్యాధికారి

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పరిశీలన..
ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు షూ పంపిణీ



బోయిన్ పల్లి నవంబర్ 07 (జనంసాక్షి)

మండల విద్యాధికారి శ్రవణ్ కుమార్ శనివారం ఉదయం ప్రార్థనా సమయానికి ముందే కోరేం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన ప్రగతిని పరిశీలించారు. రెండో తరగతి విద్యార్థులకు స్పాట్ అసెస్‌మెంట్ నిర్వహించి వారి విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. ప్రీ ప్రైమరీ తరగతి గదిని సైతం పరిశీలించి విద్యార్థులకు అందుతున్న బోధన, అభ్యసన విధానాలను సమీక్షించారు.అనంతరం పాఠశాలలో ప్రభుత్వం అందజేసిన షూల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జంపుక మాధవి, ఉప సర్పంచ్ ఎర్రగడ్డం స్వామిరెడ్డి, ఏఏపీసీ చైర్మన్ కాశీపాక మమత, వార్డు సభ్యురాలు సంగీత, మండల విద్యాధికారి శ్రవణ్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు పరశురాం, ఉపాధ్యాయులు నరేందర్, రఘు విద్యార్థులకు షూలను పంపిణీ చేశారు.అనంతరం మండల విద్యాధికారి శ్రవణ్ కుమార్ దీపావళి వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సివి రామన్ జయంతి సందర్భంగా జిల్లా పరిషత్ పాఠశాలలో వివిధ రకాల పోటీలు

ఎడపల్లి, నవంబర్ 7 (జనంసాక్షి);

సర్ సివి రామన్ జయంతి సందర్భంగా నడిపెల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో వివిధ రకాల పోటీలను నిర్వహించారు. సాటాపూర్ ఫాం హైస్కూల్ అల్యూమిని అసోసియేషన్, జిల్లా పరిషత్ పాఠశాల రెంజల్ అల్యూమిని అసోసియేషన్ ఆధ్వర్యంలో క్విజ్, రంగోలి, పాటల పోటీలను ఎడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థి విద్యార్థులకు బహుమతులు సైతం అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు విశ్రాంత ప్రధానో పాధ్యాయులు విజయానందరావు, విశ్రాంత ఎంపీడీవో గోపాలకృష్ణ, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ గంగా శంకర్, ఎడపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేములపల్లి రవి కుమార్ మండలంలోని ఉన్నత పాఠశాలల సైన్సు ఉపాధ్యాయులు ప్రశాంత్ రెడ్డి, నరేందర్, నరేన్ తదితరులు పాల్గొన్నారు.



దీపావళి వేడుకల్లో భాగంగా అంధుల పాఠశాల విద్యార్థులకు నూతన దుస్తుల పంపిణీ

కరీంనగర్ కల్చరల్, నవంబర్ 07,(జనం సాక్షి):

భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దీపావళి పండుగను పురస్కరించు కుని అంధుల పాఠశాల విద్యార్థులకు నూతన దుస్తులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి దీపావళి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు అక్కినపల్లి నాగరాజు మాట్లాడుతూ అంధుల పాఠశాల విద్యార్థులకు దీపావళి పండుగ సందర్భంగా నూతన దుస్తులు అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.విద్యార్థులతో కలిసి పండుగ వేడుకల్లో పాల్గొనడం ఎంతో తృప్తినిచ్చిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి సహకారం అందించిన వెలి సోజు శివ,శ్రీకర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అక్కినపల్లి నాగరాజు,శివజ్యోతి,జడల స్వప్న, రాఘవేంద్ర, రవితేజ, సిద్ధార్థ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు కళా ప్రపూర్ణ, పద్మ, సంగీత,సరళ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పీఎం శ్రీ కబడ్డీ పోటీల్లో నిజామాబాద్ బాలికల జట్టుకు తృతీయ స్థానం



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 07 జనంసాక్షి :

హైదరాబాద్‌లో నవంబర్ 5, 6 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-17 పీఎం శ్రీ పాఠశాలల బాలికల కబడ్డీ పోటీల్లో నిజామాబాద్ జిల్లా జట్టు ప్రతిభ కనబరిచి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాల జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో నిజామాబాద్ బాలికలు తమ ఆటతీరుతో ఆకట్టుకుని మూడో స్థానంలో నిలిచారు.ఈ సందర్భంగా జిల్లా జట్టును అదనపు కలెక్టర్ భుజంగరావు, జిల్లా విద్యాశాఖ అధికారి సాయ గౌడ్ అభినందించారు. క్రీడల్లో జిల్లా బాలికలు సాధించిన ఈ విజయం అభినందనీయమని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వనజా రెడ్డి, భూమా గౌడ్, సురేష్ కుమార్, అశోక్, లింగన్నతో పాటు.ఎస్జీఎఫ్ కార్యదర్శి అలివేణి మంగ, ఫిజికల్ డైరెక్టర్లు సాయి రాధ, క్రాంతి, లావణ్య, సురేష్, తదితరులు పాల్గొని క్రీడాకారిణులను అభినందించారు. ఈ విజయం భవిష్యత్తులో జిల్లా క్రీడాకారిణులు మరిన్ని రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి విజయాలు సాధించేందుకు నాంది కావాలని వారు ఆకాంక్షించారు.

తెలంగాణ విశ్వవిద్యాలయంలో జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 7 జనం సాక్షి:

జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం (ఔూా) యూనిట్?ఎ అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీని ఎన్ఎస్ఎస్ యూనిట్?ఎ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సీ హెచ్ శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, వ్యాధి లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్య చికిత్స పొందడం ద్వారా క్యాన్సర్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని తెలిపారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, పోషకాహారం, వ్యాయామం, పొగాకు మరియు మద్యపానానికి దూరంగా ఉండటం ద్వారా క్యాన్సర్ ముప్పును కొంతవరకు తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు.ర్యాలీలో ఎన్ఎస్ఎస్ యూనిట్?ఎ వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని క్యాన్సర్ నివారణ, ముందస్తు గుర్తింపు, చికిత్స ప్రాముఖ్యతను తెలియజేస్తూ వివిధ నినాదాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. క్యాన్సర్ పట్ల భయాన్ని వీడి, వ్యాధిపై సరైన అవగాహన పెంపొందించుకోవాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్?ఎ వాలంటీర్లు గౌతమ్ మనోహర్ బాలమణి మణిదీప్ కలీం రోహన్ స్వాతి త్రిష శశిక నీరజ సుస్వర హారిక పృథ్వి సౌందర్య శ్రావణి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



పారమిత విద్యాసంస్థలలో ఘనంగా ముందస్తు దీపావళి వేడుకలు

కరీంనగర్, క్రైమ్ నవంబర్ 07 (జనంసాక్షి) :

పారమిత విద్యాసంస్థలలో ముందస్తు దీపావళి వేడుకలు నయనానందకరంగా నిర్వహించారు. ఇట్టి వేడుకల్లో విద్యార్థిని విద్యార్థులు దీపావళి పండుగ యొక్క ప్రాముఖ్యతను పాటల రూపంలో, నాటక రూపంలో మరియు నృత్య రూపంలో కళ్ళకు కట్టిన విధంగా వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్య క్రమాలు ఆద్యంతం ఆహుతులను అలరించాయి. ఈ సందర్భంగా పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు, ప్రధానోపాద్యాయులు మాట్లాడుతూ చెడు పైన మంచి సాధించిన విజయానికి ప్రతీకగ దీపావళి పండుగను ఆనందంగా నిర్వహించుకుంటామని, ఈ సంతోషకర సమయంలో తల్లి దండ్రులు చెప్పిన సూచనలకు తగ్గట్టుగా దీపాలు వెలిగించే సమయంలో, టపాసులు పేల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పారమిత పాఠశాలల చైర్మన్ ఇనుగంటి ప్రసాదరావు తల్లిదండ్రులకు,విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, కరీంనగర్ పట్టణ ప్రజలందరికీ ముందస్తు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, వి.యు.ఎం. ప్రసాద్, వినోద్ రావు, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, ప్రశాంత్, బాలాజీ , శ్రీకర్, కవిత ప్రసాద్ సమన్వయ కర్తలు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామ భద్రతకు కమ్యూనిటీ సీసీ కెమెరాలు ఎంతో కీలకం: సిఐ

-నేరాల నియంత్రణకు ప్రజల భాగస్వామ్యం అవసరం..
-ప్రతి గ్రామంలో కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి: పోలీసుల సూచన

శంకరపట్నం నవంబర్ 7 జనంసాక్షి:

గ్రామాల్లోల్లో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు, ఇతర నేరాలను అరికట్టేందుకు కమ్యూనిటీ సీసీ కెమెరాలు ఎంతో కీలకమని హుజురాబాద్ రూరల్ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని చింతలపల్లి గ్రామ సర్పంచ్ చింతల జూ లావణ్య, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన కూడళ్లు, ముఖ్యమైన ప్రాంతాలను కవర్ చేసేలా ఏర్పాటు చేసిన నాలుగు కమ్యూనిటీ సీసీ కెమెరాలను సీఐ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకొచ్చిన సర్పంచ్, పాలకవర్గ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాలు జరగకుండా ముందస్తు నియంత్రణ సాధ్యమవుతుందని, ఏదైనా నేరం జరిగినప్పుడు నిందితులను గుర్తించడంతో పాటు నేర పరిశోధనకు అవసరమైన కీలక ఆధారాలను సేకరించేందుకు కెమెరాల ఫుటేజ్ ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు ముందుకొచ్చి గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, ముఖ్యమైన ప్రదేశాల్లో కమ్యూనిటీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే దుకాణాలు, షాపింగ్ మాల్స్, వ్యాపార సంస్థల యజమానులు సైతం తమ సంస్థల్లో నాణ్యమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ప్రజలందరూ బాధ్యతగా భాగస్వాములై సురక్షిత, నేరరహిత గ్రామాల నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, పోలీసుల సమన్వయంతోనే శాంతిభద్రతలను మరింత సమర్థవంతంగా కాపాడగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేశవపట్నం ఎస్ఐ శేఖర్, పోలీస్ సిబ్బంది, పంచాయతీ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ ను నిషేధిద్దాం- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

వీణవంక లో ప్లాస్టిక్ వ్యతిరేకంగా జమ్మికుంట న్యూ మిలీనియం స్కూల్ విద్యార్థుల ర్యాలీ..

ఎస్ ఆవుల తిరుపతి,న్యూ మిలీనియం స్కూల్ చైర్మన్ ముసిపట్ల తిరుపతిరెడ్డి

వీణవంక నవంబర్ 7 (జనం సాక్షి)



వీణవంక మండల కేంద్రంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలంటూ, జమ్మికుంట న్యూ మిలీనియం స్కూల్ విద్యార్థులు రకరకాల వేషధారణతో, ప్ల కార్డులతో నినాదాలు చేస్తూ,ఎంపీడీవో కార్యాలయం నుండి బస్టాండ్ వరకు న్యూ మిలీనియం స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో ముఖ్య అతిథులుగా వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి,న్యూ మిలీనియం స్కూల్ గ్రూప్ ఆఫ్ చైర్మన్ ముసిపట్ల తిరుపతి రెడ్డి హాజరయ్యారు.శనివారం రోజున వీణవంక మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో స్కూల్ విద్యార్థులు మానవహారంగా ఏర్పడి,ప్లాస్టిక్ భూతాన్ని నివారించాలని కోరుతూ,ప్లాస్టిక్ పదార్థాలను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా ర్యాలీని ఉద్దేశించి ఎస్ఐ ఆవుల తిరుపతి మాట్లాడుతూ.. దేశంలో ప్రస్తుతం పెరుగుతున్న ప్రపంచ ఆధునికరణలో ప్లాస్టిక్ వాడకం మరింత పెరిగిందని,ప్లాస్టిక్ భూమిలో త్వరగా కలసిపోదని, పర్యావరణంలో, భూమిలో ప్లాస్టిక్ కలుషితం వల్ల జీవరాసులకు రకరకాల అనర్థాలు ఏర్పడనున్నన్నారు.ప్లాస్టిక్ వల్ల భయంకరమైన క్యాన్సర్ వ్యాధులు సోకే ప్రమాదాలు ఉన్నాయని అన్నారు.అనంతరం న్యూ మిలీనియం స్కూల్ గ్రూప్ ఆఫ్ చైర్మన్ ముసిపట్ల తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ కాలుష్యానికి ప్లాస్టిక్ వ్యర్థాలు ప్రమాదకరంగా మారాయన్నారు. ప్రతిరోజు పిల్లలు తినే చిప్స్,రకరకాల ప్యాకెట్లలో వాడే రకరకాల ప్లాస్టిక్ రసాయనాల వల్ల పిల్లలు జీర్ణ వ్యవస్థ దెబ్బతిని,ఆరోగ్య సమస్యలు రావడం జరుగుతుందన్నారు.ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు పాల ప్యాకెట్ మొదలుకొని, మనం వాడే పెన్ను వరకు ప్లాస్టిక్ వస్తువులు భూమిలో కలిసేందుకు కొన్ని సంవత్సరాల కాలం గడుస్తుందని, ప్లాస్టిక్ ను దగ్ధం చేసేటప్పుడు వెలువడే విష రసాయనాల వల్ల శ్వాసకోశ వ్యాధులు,అలర్జీ లాంటి చర్మ వ్యాధులు సోకి,మానవుని మనుగడకు అంతరాలుగా మారుతున్నాయన్నారు వాడుకొని,మన ఆరోగ్యాన్ని మనం కాపాడుకోవాలని వారు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో న్యూ మిలీనియం స్కూల్ చైర్మన్ ముసిపట్ల తిరుపతి రెడ్డి,గ్రామ సర్పంచ్ దాసరపు సరోజన-రాజేంద్రప్రసాద్,ఉప సర్పంచ్ తాళ్లపల్లి మహేష్,న్యూ మిలీనియం ప్లే స్కూల్ హెచ్ఎం వరుణ్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు, సిబ్బంది,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సాగు పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలి

రైతులకు వరి పొలంబడి ద్వారా సాగు మెళకువలపై అవగాహన



కేశవపట్నం నవంబర్ 7 జనంసాక్షి

రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ సాగు ఖర్చులు తగ్గించుకుని, అధిక దిగుబడులు సాధించాలని మానకొండూర్ వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీధర్ సూచించారు. ఆత్మ (ఏటీఎం ఏ) ఆధ్వర్యంలో శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలో రైతు క్షేత్ర పాఠశాల (ఎఫ్ ఎఫ్ ఎస్) కార్యక్రమంలో భాగంగా వరి పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు రైతులతో కలిసి నేరుగా వరి పొలాలను సందర్శించి పంట ఎదుగుదల, ప్రస్తుత పరిస్థితులను పరిశీలించారు.వరి సాగులో పాటించాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులు, నీటి పొదుపు, ఎరువుల సమతుల్య వినియోగం, కలుపు నివారణ, చీడపీడలు, తెగుళ్ల గుర్తింపు, నివారణ చర్యలపై రైతులకు క్షేత్రస్థాయిలో వివరించారు. పంటలో సమస్యలను ముందుగానే గుర్తించి తగిన నివారణ చర్యలు చేపట్టడం ద్వారా పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవచ్చని సూచించారు. అవసరానికి మించి ఎరువులు, పురుగుమందులు వినియోగించకుండా శాస్త్రీయ సూచనల మేరకు వ్యవసాయం చేయాలని తెలిపారు.రైతులు పుస్తకాల్లోని పద్ధతులకే పరిమితం కాకుండా పొలాల్లోనే పంట పరిస్థితులను పరిశీలిస్తూ అనుభవపూర్వకంగా సాగు మెళకువలు నేర్చుకోవడం ఈ రైతు క్షేత్ర పాఠశాల ప్రధాన ఉద్దేశమని అధికారులు వివరించారు.ఈ కార్యక్రమంలో మానకొండూర్ వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీధర్, ఆత్మ కమిటీ చైర్మన్ రవి, శంకరపట్నం మండల వ్యవసాయ అధికారి వెంకటేష్, ఏఈఓ లు స్రవంతి, సునంద, ఆరతి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త విజయ్, వ్యవసాయ విస్తరణ అధికారులుతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

త్వరలో నిజామాబాద్‌లో జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పర్యటన

ఎంపీ అర్వింద్ ధర్మపురి విజ్ఞప్తికి సానుకూల స్పందన



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 7 జనం సాక్షి: దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ చేపడుతున్న వివిధ యాత్రలు, కార్యక్రమాల్లో భాగంగా నిజామాబాద్‌లో కూడా పర్యటించి, యాత్ర నిర్వహించాలని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్‌ను కోరారు.ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ, నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పార్టీకి ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన ప్రాంతమని, ఇక్కడ పార్టీ కార్యకర్తలు ప్రజలతో మమేకమై వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు. జాతీయ స్థాయి నాయకత్వం నిజామాబాద్‌లో పర్యటించడం ద్వారా పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నెలకొనడంతో పాటు, ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమయ్యే అవకాశం కలుగుతుందని తెలిపారు.ఎంపీ అర్వింద్ విజ్ఞప్తిపై జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ సానుకూలంగా స్పందించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ ఇంకా ఖరారు కాలేదని, పర్యటన తేదీలు, కార్యక్రమాలు ఖరారైన వెంటనే నిజామాబాద్‌లో కూడా యాత్ర నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తానని ఎంపీకి తెలిపారు.జాతీయ అధ్యక్షులు తన విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించడం పట్ల ఎంపీ అర్వింద్ ధర్మపురి సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ పర్యటన ఖరారైన అనంతరం నిజామాబాద్ పర్యటనకు సంబంధించి తగిన ఏర్పాట్లు, కార్యక్రమాల రూపకల్పనపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటామని తెలిపారు.దీపావళి పండుగ అనంతరం ఢిల్లీలో జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్‌ను ప్రత్యక్షంగా కలిసి, నిజామాబాద్ పర్యటనకు అధికారికంగా ఆహ్వానించనున్నట్లు ఎంపీ అర్వింద్ వెల్లడించారు.జాతీయ అధ్యక్షుల పర్యటన ద్వారా నిజామాబాద్ ప్రాంతంలో పార్టీ కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యత లభిస్తుందని, కార్యకర్తలకు జాతీయ నాయకత్వంతో నేరుగా మమేకమయ్యే అవకాశం కలుగుతుందని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు.

దళిత సంఘం పేరు చెప్పుకుని జర్నలిస్టులను బెదిరిస్తే చూస్తూ ఊరుకోం

సీనియర్ జర్నలిస్ట్ బుర్ర రాజ్ కోటి హెచ్చరిక



గన్నేరువరం, నవంబర్ 07 (జనంసాక్షి):

గన్నేరువరం మండలంలోని ఖాసీంపేట ఫీల్డ్ అసిస్టెంట్ వ్యవహారంలో ఒక వాట్సాప్ గ్రూప్ లో మాజీ దళిత నాయకుడు పెట్టిన మెసేజ్ పై సీనియర్ జర్నలిస్ట్ బుర్ర రాజ్ కోటి ఘాటుగా స్పందించారు. జర్నలిస్టులు తప్పుడు వార్తలు రాశారని" ఆరోపిస్తూ, దళిత సంఘం పేరు చెప్పుకుని జర్నలిస్టులను బెదిరించే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోమని ఆయన హెచ్చరించారు.ఏ పార్టీకి కొమ్ముకాయం. ఈరోజు ఉంటుంది, రేపు పోతుంది. జర్నలిస్టులు ఎప్పుడూ ప్రజల పక్షానే నిలబడతారు. ఎక్కడ అన్యాయం జరిగిందని తెలిస్తే అక్కడ న్యాయం కోసం పోరాటం చేస్తారు. ఫీల్డ్ అసిస్టెంట్ పై కథనాలు వస్తూనే ఉంటాయి, అధికారులు తేల్చాలి. జర్నలిస్టులు ఎవరికీ భయపడరు, నిజాన్ని ప్రజల ముందు ఉంచుతారు అని రాజ్ కోటి స్పష్టం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ పై వచ్చిన ఆరోపణలపై విచారణ జరుగుతుండగా, మధ్యలో జర్నలిస్టులను టార్గెట్ చేయడం సరికాదని ఆయన అన్నారు.

దొంగతనం కేసును ఛేదించిన ఎన్టిపిసి పోలీసులు

నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు



అంతర్గాం, జనంసాక్షి :

రామగుండం పోలీస్ కమిషనరేట్ ఎన్టిపిసి పోలీస్ స్టేషన్ పరిధి కృష్ణానగర్‌కు చెందిన రఫీక్ ఖాన్ కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 5న కరీంనగర్‌లో జరిగిన ఒక శుభకార్యానికి హాజరయ్యేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లారు. తిరిగి ఈ నెల 6న రాత్రి ఇంటికి చేరుకోగా, ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని ఆసరాగా చేసుకొని, ఇంటి తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి, బీరువాలో భద్రపరిచిన రూ.95,500/- నగదును దొంగిలించుకొని వెళ్లినట్లు గుర్తించారు.ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకట్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో భాగంగా రామగుండం సీఐ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో ఎస్సై వెంకట్, కానిస్టేబుళ్లు తొడేటి అంజి, తీట్ల శ్రీను కలిసి ప్రత్యేక బృందంగా ఏర్పడి చాకచక్యంగా దర్యాప్తు నిర్వహించారు. ఈ క్రమంలో కేవలం 24 గంటల వ్యవధిలోనే పాత నేరస్థుడైన ఐత వెంకటేష్ (26 సంవత్సరాలు)ను పట్టుకొని, అతని వద్ద నుంచి దొంగిలించబడిన మొత్తం రూ.95,500/- నగదును స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదైన 24 గంటల్లోనే నిందితుడిని పట్టుకొని, దొంగిలించబడిన సొత్తును పూర్తిగా స్వాధీనం చేసుకున్న పోలీసు అధికారులను, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

రాష్ట్ర వాలీబాల్ ఛాంపియన్ షిప్ కైవసం చేసుకున్న జిల్లా జట్టు

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 07 జనంసాక్షి:

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరుగుతున్న 70వ రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ అండర్-17 బాలికల వాలీబాల్ టోర్నమెంట్‌లో నిజామాబాద్ జిల్లా బాలికల జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర వాలీబాల్ బాలికల అండర్ 17 ఎస్జీఎఫ్ ఛాంపియన్షిప్ కైవసం చేసుకుందనీ జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి అలివేణి మంగ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సమష్టి కృషి, అద్భుత ఆటతీరుతో విజేతగా నిలిచి జిల్లాకు గర్వకారణంగా నిలిచిందనీ ఆమె అన్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి అలివేణి మంగ విజేత జట్టుకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. జట్టు విజయానికి కృషి చేసిన కోచ్‌లు మధు పీడీ, సుష్మలను ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాకారిణులు ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



వీబీజీ రామ్‌జీ పథకాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలి : కలెక్టర్ కోయ శ్రీహర్ష

- గ్రామపంచాయతీ, మహిళా సంఘాల భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి
- ఓదెల మండలం లో ఉపాధి హామీ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్



ఓదెల/పెద్దపల్లి,నవంబర్ 07(జనంసాక్షి) :
వీబీజీ రామ్‌జీ పథకాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని గ్రామాల్లో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఓదెల మండలంలో విస్తృతంగా పర్యటించి గోపరపల్లి, హరిపురం గ్రామాల్లో జరుగుతున్న వీబీజీ రామ్‌జీ ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఓదెల మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి కార్యాలయ నిర్వహణ, పథకం అమలు, పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, వీబీజీ రామ్‌జీ పథకం ద్వారా గ్రామాల్లో చేపట్టే పనులను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో ఉన్న సాగునీటి కాలువల పూడికతీత పనులను పక్కాగా చేపట్టి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కాలువల్లో పూడిక తొలగించడం ద్వారా నీటి ప్రవాహానికి ఆటంకాలు తొలగించి, సాగునీటి సరఫరా మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రతి గ్రామంలో స్థానిక అవసరాలను గుర్తించి,వీబీజీ రామ్‌జీ పథకం కింద చేపట్టడానికి అనువైన పనులను గుర్తించాలని అధికారులకు సూచించారు. గ్రామాల అభివృద్ధికి ఉపయోగపడే పనులను ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసి, అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయ భవనాలు, మహిళా సంఘాల భవనాల నిర్మాణాలను వీబీజీ రామ్‌జీ పథకం నిబంధనలకు అనుగుణంగా చేపట్టి, అసంపూర్తి గా ఉన్న నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా భవనాల నిర్మాణాలకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకొని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ఉపాధి హామీ పనులకు ప్రతిరోజూ హాజరయ్యే కూలీల సంఖ్యను మరింత పెంచాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో కూలీలకు అందుబాటులో ఉన్న పనుల గురించి విస్తృతంగా అవగాహన కల్పించి, ఎక్కువ మంది కూలీలు పనుల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పనులు చేపట్టే ప్రాంతాల్లో కూలీలకు తాగునీరు, నీడ వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని సూచించారు.ఉపాధి హామీ పనుల నిర్వహణలో కూలీల హాజరు, మస్టర్ రోల్స్ నమోదు, పనుల కొలతలు, నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలని తెలిపారు.
చేపట్టిన ప్రతి పనిని క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ నాణ్యతతో పూర్తి చేయాలని, పనుల అమలులో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలని అధికారులను ఆదేశించారు.మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి,నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పర్యటనలో ఎంపీడీవో అనిల్ రెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ట్రాజెన్ రోవర్ వినియోగంపై శిక్షణ పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు
- ఫీల్డ్ సిబ్బందికి సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించేలా ప్రత్యేక శిక్షణా కార్యక్రమం



పెద్దపల్లి,నవంబర్ 07(జనంసాక్షి) : భూ సర్వే ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయడానికి ఎక్స్‌ట్రాజెన్ రోవర్ పరికరాల వినియోగంపై సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించు కోవాలని అదనపు(రెవిన్యూ) కలెక్టర్ బి. శ్రీరాములు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సర్వే, సెటిల్మెంట్ , భూ రికార్డుల కమీషనర్ అండ్ డైరెక్టర్ ఉత్తర్వుల ప్రకారం. పెద్దపల్లి జిల్లాలో కొనసాగుతున్న భూముల పునఃసర్వే (రీసర్వే) కార్యక్రమంలో భాగంగా ఎక్స్‌ట్రాజెన్ రోవర్ వినియోగం నిర్వహణపై శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల పునఃసర్వేను పక్కాగా నిర్వహించేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. శిక్షణ ద్వారా పొందిన సాంకేతిక నైపుణ్యాలను క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో వినియోగించి, ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్దేశిత కాల పరిమితిలోగా పునఃసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పునఃసర్వే పనులను వేగవంతం చేయడం మరియు ఫీల్డ్ సిబ్బంది యొక్క సాంకేతిక సామర్థ్యాలను పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే సోమేశ్వర్, డిప్యూటీ తహసీల్దార్లు సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు, గ్రామ పంచాయతీ అధికారులు (జిపిఒలు) సంబంధిత రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ఆరోపణలు చేయవద్దు

- చట్టప్రకారమే బాలరాజు అరెస్టు
- ఎన్ఎస్ యూఐ ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు బండారి సునీల్



పెద్దపల్లి,నవంబర్ 07(జనంసాక్షి) :
రాజకీయాల్లో నాయకుల వ్యక్తిగత జీవితాలపై అసత్య ప్రచారాలు చేయడం సరికాదని ఎన్ఎస్ యూఐ ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు బండారి సునీల్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్ వేదికగా విడుదల చేసిన ప్రకటనలో ఆయన పలు అంశాలను ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ నేత బల్మూరి వెంకట్‌కు సంబంధించిన వ్యక్తిగత ఫొటోలను మార్ఫింగ్ చేసి,సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారనే ఫిర్యాదు మేరకు పోలీసులు చట్టప్రకారమే దూదిమెట్ల బాలరాజు యాదవ్‌ను అదుపులోకి తీసుకున్నారని సునీల్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ అంశాన్ని బీఆర్ఎస్ నాయకుడు చిరుమల్ల రాకేష్ రాజకీయం చేయడం అక్షేపణీయమని అన్నారు. రాజకీయ ఉనికి కోసం ఇతరులపై నిరాధారమైన ఆరోపణలు చేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు.రాజకీయాల్లో విధానపరమైన విమర్శలు ఉండాలే తప్ప,వ్యక్తిగత అంశాలను వివాదాస్పదం చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన రాజకీయ నాయకులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని, అనవసర వివాదాలకు తావివ్వకుండా ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని సునీల్ గౌడ్ సూచించారు.



పెద్దకొడప్గల్ లో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

అండర్ 14 బాలిక జట్టు విన్నర్ ఎల్లారెడ్డి జోన్
అండర్ 17 బాలిక జట్టు విన్నర్ మద్నూర్ జోన్
అండర్ 14 బాలుర జట్టు విన్నర్ ఎల్లారెడ్డి జోన్
అండర్ 17 బాలుర జట్టు విన్నర్ పిట్లం జోన్

పెద్ద కొడప్గల్ నవంబర్ 07 (జనంసాక్షి):
పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం 70వ ఎస్జీఎఫ్ కామారెడ్డి జిల్లా స్థాయి బాలబాలికల అండర్ 14, అండర్ 17 కబడ్డీ పోటీలు అట్టహాసంగా నిర్వహించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు క్రీడలను ప్రారంభించారు. క్రీడాకారుల కోసం హెల్త్ క్యాంప్, మధ్యాహ్న భోజనం, నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. అండర్ 14 బాలిక జట్టు మొదటి స్థానాన్ని ఎల్లారెడ్డి జోన్, అండర్ 17 బాలిక జట్టు మొదటి స్థానాన్ని మద్నూర్ జోన్, అండర్ 14 బాలుర జట్టు మొదటి స్థానాన్ని ఎల్లారెడ్డి జోన్, అండర్ 17 బాలుర జట్టు మొదటి స్థానాన్ని పిట్లం జోన్ దక్కించుకున్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, తహశీల్దార్ రాజశేఖర్, ఎంపీడీవో అభినవ్ చందర్, ఎంఈఓ ప్రవీణ్ కుమార్, ఎస్జీఎఫ్ జిల్లా సెక్రటరీ శ్రీధర్, ఎస్ఐ అరుణ్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు శామప్ప పటేల్, ఫిజికల్ డైరెక్టర్లు, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి ముందు పార్క్ చేసిన వాహనాలే టార్గెట్

- జల్సాలకు అలవాటు పడి ద్విచక్ర వాహనాల దొంగతనం
- ప్రత్యేక టీం బృందం తో గుర్తించి నిందితుడిని అరెస్టు చేసిన పెద్దపల్లి పోలీసులు

పెద్దపల్లి,నవంబర్ 07(జనంసాక్షి) :
జల్సాల కోసం సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో గత కొన్ని నెలల నుండి పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ముందు పార్క్ చేసిన బైక్ లను టార్గెట్ చేస్తూ వాటిని దొంగతనం చేస్తున్న నిందితుడిని 8 ద్విచక్ర వాహనాలతో పాటు శనివారం పట్టుకోవడం జరిగిందని పెద్దపెల్లి ఏసిపి జి కృష్ణ వివరాలు వెల్లడించారు. నేరస్థుడు జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం ముంజంపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి. ప్రస్తుతం తల్లితో పెద్దపల్లి పట్టణంలో ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్నాడని అతను గతంలో బసంత్ నగర్ లోని సిమెంట్ ఫ్యాక్టరీ నందు లోడింగ్ పని చేసేవాడు, 2025 సంవత్సరంలో అతని హార్ట్ కు స్టంట్ పడగా అప్పటినుండి ఆ పని మానివేసి కూలి పని చేస్తూ జీవిస్తున్నాడు. ఆ తర్వాత అతని భార్య లక్ష్మికి అతనికి మధ్య మనస్పర్ధలు రాగా నిందితుడు అతని అమ్మ అయిన ఈశ్వరి తో కలిసి హనుమాన్ నగర్ లో కిరాయికి ఉంటున్నాడు. నేరస్తుడు కూలి పని చేయగా వచ్చే డబ్బులు తన అవసరాలకు జల్సాలకు సరిపోనందున సులభంగా డబ్బులు సంపాదించాలని అనుకొని, బైకులు దొంగతనం చేసి వాటన్నింటినీ ఒకేసారి మహారాష్ట్రకు తీసుకువెళ్లి ఎవరికైనా అమ్మితే ఎక్కువ డబ్బులు వస్తాయని మరియు ఎవరికీ అనుమానం రాదని నిర్ణయించుకున్నాడు.దానికోసం చూస్తున్న క్రమంలో పెద్దపెల్లి ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఎప్పుడు బైకులు పార్క్ చేసి ఉండడం తను గుర్తించి అక్కడ పార్క్ చేసిన బైకులు దొంగతనం చేయడం సులభమని నిర్ణయించుకొని ఆగస్ట్ నెల నుండి వరసగా బైక్ లను దొంగతనం చేసి తను కిరాయికి ఉంటున్న ఇంటి వద్ద దాచినాడు.వరుసగా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బైక్ లు దొంగతనాలు అవుతున్న దృష్ట్యా ,వాటిని నిలువరించేందుకు పెద్దపల్లి డిసిపి బి.రామ్ రెడ్డి, ఏసిపి జి .కృష్ణ ఆదేశానుసారం పెద్దపల్లి సిఐ కే.ప్రవీణ్ కుమార్ పర్యవేక్షణలో పెద్దపల్లి టౌన్ ఎస్ ఐ జి రాజశేకర్ సారధ్యంలో ఒక స్పెషల్ టీం ను ఏర్పాటు చెయ్యడం జరిగిందని వారు నిందితుడిని గుర్తించి బంధంపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ వద్ద నిందితుడు తను దొంగలించిన హోండా షైన్ పై వెళ్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. నిందితుడి నుండి మొత్తంగా 8 బైక్ లను సీజ్ చేశామని నేరస్తుడిని పట్టుకోవడంలో చాకచక్యం గా వ్యవహరించిన పెద్దపల్లి టౌన్ ఎస్ ఐ జి.రాజశేకర్, హెడ్ కానిస్టేబుల్ ఎం.రమేష్,కానిస్టేబుల్స్ కె.ప్రభాకర్,ఎం.అనిల్ కుమార్ లను ఏసీబీ అభినందించారు.



బడుగుల గొంతుకగా పనిచేస్తా

- తెలంగాణ రక్షణ సేన జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఉస్తేం శ్రీనివాస్

పెద్దపల్లి,నవంబర్ 07(జనంసాక్షి) :

తెలంగాణ రక్షణ సేన జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా ఉస్తేం శ్రీనివాస్ నియమితులయ్యారు. హైదరాబాద్ లోని కేంద్ర కార్యాలయం నుంచి సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈ నియామకానికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులను జారీ చేశారు.క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు వెనుకబడిన వర్గాల హక్కులు, సమస్యల పరిష్కారానికి అండగా నిలవాలని ఈ సందర్భంగా అధిష్ఠానం సూచించింది.జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా ఉస్తేం శ్రీనివాస్ నియామకం పట్ల ప్రగతి మృత్యు కార్మిక సేవ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా శనివారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో ప్రగతి మృత్యు కార్మిక సేవ సమితి నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉస్తేం శ్రీనివాస్ ను శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా నిరంతరం ప్రజాసేవ, జాతి అభ్యున్నతే ధ్యేయంగా ఉస్తేం శ్రీనివాస్ పని చేస్తున్నానని గుర్తుచేశారు.ఎన్ని ఒడిదు దుకులు ఎదురైనా వెనకడుగు వేయకుండా ముది రాజ్ జాతి బిడ్డల సమస్యల పరిష్కారం కోసం, మత్స్య కార్మిక సహకార సంఘాల హక్కుల కోసం నిరంతరం అండగా నిలబడడం అభినందనీ యమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఉస్తేం శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పెద్దపల్లి జిల్లా బీసీ సెల్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు,ఇందుకు సహకరించిన పార్టీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అల్లంపల్లి రామకోటికి, రాష్ట్ర నాయకత్వానికి ఉస్తేం శ్రీనివాస్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.బడుగు, బలహీన వర్గాల గొంతుకై పనిచేస్తూ,సంస్థ సిద్ధాంతాలను



ప్రతి పల్లెకూ తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.పెద్దమ్మ తల్లి ఆశయాల వారసులుగా ముదిరాజ్ జాతి అభివృద్ధి కోసం నాయకులంతా నిబద్ధతతో,విప్లవాత్మక ఆలోచన లతో ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఈ సన్మాన కార్యక్రమంలో ప్రగతి మృత్యు కార్మిక సేవ సమితి ముదిరాజ్ క్రమశిక్షణ పార్టీ చైర్మన్ కారుపాకాల రమేష్,జిల్లా ఉపాధ్యక్షుడు కలవేన రవి,ముదిరాజ్ జిల్లా నాయకుడు కలవేన శీనివాస్, మీడియా ఇంచార్జి కలవేన రాము, ముత్తారం మండలం అధ్యక్షులు ఎర్రం లక్ష్మయ్య, ఈర్ల సదయ్య, సబ్బు తిరుపతి,కారుపాకాల రాజేందర్, జునువాలా శ్రీనివాస్,శంకరి తోపాటు ముదిరాజ్ సంఘ ప్రతినిధులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐపీఎస్ పాఠశాలలో ఘనంగా దీపావళి వేడుకలు

- సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థుల సందడి

సుల్తానాబాద్,నవంబర్ 07(జనంసాక్షి) :

పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ (ఐపీఎస్)లో ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో అందమైన రంగవల్లులు తీర్చిదిద్ది, దీపాలను వెలిగించి దీపావళి సంబరాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. విద్యార్థుల సందడితో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ మాటేటి కృష్ణప్రియ హాజరై విద్యార్థులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దీపావళి పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. ఇటువంటి పండుగల నిర్వహణ ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాలని,బాణసంచా కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ సురక్షితమైన దీపావళిని జరుపుకోవాలని విద్యార్థులకు హితవు పలికారు.ఈ వేడుకల్లో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ సునీత ఉపాధ్యాయినులు,విద్యార్థినీలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటాం

మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ ఐల రమేష్

సుల్తానాబాద్, 7(జనం సాక్షి):

పట్టణంలోని శ్రీ వినాయక భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటామని మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మాజీ జిల్లా పరిషత్ సభ్యులు ఐల రమేష్, ఏడవ వార్డు కౌన్సిలర్ ఉట్ల వర ప్రదీప్ హామీ ఇచ్చారు. శుక్రవారం శ్రీ వినాయక భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన అధ్యక్షులుగా సుద్దాల గ్రామానికి చెందిన ఆవునూరి రమేష్ ఎన్నిక కాగా, స్థానిక సంఘ భవనంలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు రమేష్ ను శాలువతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణారావు సహకారంతో భవన నిర్మాణ కార్మిక సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. నూతన సంఘ భవనానికి ప్రభుత్వ భూమి కేటాయించేందుకు ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకువెళ్లి, శాశ్వత భవన నిర్మాణం కోసం కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా కాట్నపల్లి సర్పంచ్ ఓగుల పూజా రాజేందర్ మాట్లాడుతూ, నూతన కార్యవర్గం ఐక్యంగా ఉండి కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని సూచించారు. సంగం శాశ్వత భవన నిర్మాణం కోసం ప్రభుత్వ విప్ విజయ రమణారావు సహకారంతో సాధించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఆవు నూరి రమేష్ ముఖ్య అతిథులను ఘనంగా శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వినాయక భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు బొల్లి నరసయ్య, ప్రధాన కార్యదర్శి ఆరెపల్లి రత్నం, ఉపాధ్యక్షులు న్యాతరి దేవేందర్ కుమార్ క్యాదాషి రమేష్ తో పాటు కార్మికులు పాల్గొన్నారు.



రైతుల అభిప్రాయం మేరకే గొలుసు కాంటా

- ధాన్యం కొనుగోలుదారుడు దాసరి సంపత్ రెడ్డి



నుల్తానాబాద్,నవంబర్ 07(జనంసాక్షి) :

రైతుల అభిప్రాయం మేరకే గొలుసు కాంట ఏర్పాటుచేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు దాసరి సంపత్ రెడ్డి తెలిపారు. గొలుసు కాంటాలతో ఎలాంటి ఇబ్బంది లేదని, తూకంలో రైతులకు నష్టం చేసే ఆలోచన తనకు లేదని తెలిపారు. రైతులు కష్టపడి పండించిన పంటకు ధర చెల్లించడంలో, బాధ్యత యుతంగా వ్యవహరిస్తానని తెలిపారు. కావాలని కొంతమంది తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని దాసరి సంపత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గొల్లపల్లి గ్రామానికి చెందిన రైతు మర్రి సంపత్ మాట్లాడుతూ తాము ధాన్యం విక్రయించడంలో, ఎవరి ప్రలోభాలకు లొంగకుండా, మా యొక్క అభిప్రాయం మేరకే దాసరి సంపత్ రెడ్డి వరి పొలాల వద్ద కాంటాలు వేసి దాన్యం కొనుగోలు చేస్తున్నారని స్పష్టం చేశారు.

8వ వార్డులో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన కౌన్సిలర్ చింతల రాజు



సుల్తానాబాద్,నవంబర్ 07(జనంసాక్షి) :

పట్టణంలోని 8వ వార్డు అశోక్‌నగర్ పాఠశాలలో శుక్రవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను 8 వార్డు కౌన్సిలర్ చింతల రాజు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ చింతల రాజు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని స్మార్ట్ రేషన్ కార్డుల విధానాన్ని అమలు చేస్తోందన్నారు.వీటి ద్వారా రేషన్ పంపిణీ ప్రక్రియ మరింత పారదర్శకంగా సాగడంతోపాటు అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జీపీఓ మహేందర్‌రెడ్డి,అంగన్వాడీ టీచర్ నల్ల శ్రీలత,రమ,కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక రాజేశం,బోగిరి విజయకుమార్,వార్డు ప్రజలు,లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆయుష్ పోస్టుల ప్రొవిజినల్ మెరిట్ జాబితా విడుదల

కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి,నవంబర్ 07(జనంసాక్షి) :

పెద్దపల్లి జిల్లాలో జాతీయ ఆయుష్ మిషన్ కార్యక్రమాల అమలులో భాగంగా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయనున్న ఆయుష్ వైద్యాధికారులు, ఫార్మసిస్ట్, సైకో సోషల్ కౌన్సిలర్, యోగా ప్రొఫెషనల్ పోస్టులకు సంబంధించిన ప్రొవిజినల్ మెరిట్ జాబితాలను విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో ఆయుష్ వైద్యాధికారుల 3 పోస్టులు, ఫార్మసిస్ట్ 1 పోస్టు, సైకో సోషల్ కౌన్సిలర్ 1 పోస్టు, యోగా ప్రొఫెషనల్ 1 పోస్టు భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా, మొత్తం 149 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. వీటిలో ఆయుష్ వైద్యాధికారుల పోస్టులకు 115, ఫార్మసిస్ట్ పోస్టుకు 18, సైకో సోషల్ కౌన్సిలర్ పోస్టుకు 6, యోగా ప్రొఫెషనల్ పోస్టుకు 10 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు.నోటిఫికేషన్‌లో పేర్కొన్న అర్హత ప్రమాణాల ప్రకారం అభ్యర్థుల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, పోస్టుల వారీగా ప్రొవిజినల్ మెరిట్ జాబితాలను సిద్ధం చేసి విడుదల చేసినట్లు తెలిపారు. ఈ జాబితాలు పెద్దపల్లి జిల్లా అధికారిక వెబ్సైట్ పెద్దపల్లి తెలంగాణ గౌ ఇన్ లో అందుబాటులో ఉన్నాయని, అభ్యర్థులు వెబ్‌సైట్‌ను సందర్శించి తమ మెరిట్ జాబితాలను పరిశీలించుకోవాలని సూచించారు.విడుదల చేసిన ప్రొవిజినల్ మెరిట్ జాబితాలపై అభ్యంతరాలు ఏవైనా ఉంటే సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, ఆధారాలతో మూడు పని దినాల్లోగా, అనగా నవంబర్ 9,10, 11వ తేదీల్లో సమర్పించాలని కలెక్టర్ సూచించారు. గడువు ముగిసిన తర్వాత అందిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోబడవని స్పష్టం చేశారు.ఈ నియామక ప్రక్రియకు సంబంధించి ఇతర సందేహాలు, వివరాల కోసం జిల్లా ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ జి.ఎన్ అరుణ 9281172473 నంబర్‌లో సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

రాష్ట్రీయ దివ్యాంగుల సాధికారత అవార్డ్స్ 2026కు దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టర్ కోయ శ్రీహర్ష

- అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా దరఖాస్తుల ఆహ్వానం

- నవంబర్ 18 లోపు ఆన్లైన్లో దరఖాస్తులు పూర్తి చేయాలి

పెద్దపల్లి,నవంబర్ 07(జనంసాక్షి)

జిల్లాలోని వివిధ రంగాలలో విశిష్ట ప్రతిభ కనపరిచిన వికలాంగులు, వికలాంగుల సంక్షేమం కోసం కృషిచేసిన వ్యక్తుల నుండి, వికలాంగుల కొరకు పనిచేస్తున్న వివిధ సంస్థల నుండి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా అందించే "రాష్ట్రీయ దివ్యాంగుల సాధికారత అవార్డ్స్-2026" కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.హైదరాబాద్‌లో జరగనున్న అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం - 2026 సందర్భంగా రాష్ట్ర స్థాయి సత్కారాల ప్రదానానికి అర్హులైన వ్యక్తులు,సంస్థల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడ్డాయని, దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా నవంబర్ 18 లోపు సమర్పించాలని అని సూచించారు.అభ్యర్థులు వివరాల కొరకు మహిళ, పిల్లల, వికలాంగుల, వయోవృద్ధుల శాఖ వెబ్‌సైట్ ఎచ్ టిడిపి ఎస్/డి ఈ పి డబ్ల్యూ డి ఎస్ సి టి జి పి/తెలంగాణ గౌ ఇన్ ను సందర్శించాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారికి రాష్ట్రీయ దివ్యాంగుల సాధికారత అవార్డును హైదరాబాద్‌లో సత్కరించి అందజేస్తారని,ఆసక్తి,అర్హత కలిగిన దివ్యాంగులు,సంస్థలు నవంబర్ 18 లోపు దరఖాస్తు చేసుకోవాలని,మరిన్ని వివరాలు కోసం 9440852495 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆవు నూరి రమేష్ కు ఘన సన్మానం



నుల్తానాబాద్,నవంబర్ 07(జనంసాక్షి) : శ్రీ వినాయక భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన అధ్యక్షులు ఆవునూరి రమేష్ శుక్రవారం సంఘ భవనంలో ప్రమాణ స్వీకారోత్సవం చేయగా,ఉపాధ్యక్షులుగా ఎన్నికైన క్యాదాశి రమేష్, ఆవునూరి రమేష్ ను అభినందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని సూచించారు.ఆయన వెంట గౌరవ అధ్యక్షులు బొల్లి నరసయ్య,ఓగుల రాజేందర్,తదితరులు ఉన్నారు.